
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 31 ఆగస్టు 2025





ట్రస్టు నిర్వాహకులతో వాగ్వివాదం చేస్తున్న గ్రామస్థులు



ట్రస్టు భూముల్లో నరికేసిన జామాయిల్ చెట్లు

ట్రస్టు భూములపై రియల్టర్ల కన్ను

- అడ్డుకున్న జిర్రావారిపాలెం గ్రామస్థులు • ట్రస్టు నిర్వాహకులతో వాగ్వివాదం
- తహసీల్దార్‌కు వినతిపత్రం

కలిగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెం వద్ద మాగుంట చారిటబుల్ ట్రస్టుకు కేటాయించిన భూమిని శనివారం పలువురు యంత్రాలతో చదును చేయడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. 40 ఏళ్ల క్రితం విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తామనడంతో ప్రభుత్వం మాగుంట చారిటబుల్ ట్రస్టుకు 4.02 ఎకరాల భూమిని, ఎకరం నాలుగువేల చొప్పున అందచేసింది. కలిగిరి ప్రాంతంలో 1992లో మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాలను ట్రస్టు ఆధ్వర్యంలో స్థాపించారు. మొదటగా పట్టణంలో స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాలలో కళాశాలను ప్రారంభించారు. అనంతరం ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని కొంతకాలం అక్కడ కొనసాగించారు. ఆ సమయంలో కళాశాలకు భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేయగా, కలిగిరి-జిర్రావారిపలెం సమీపాన రోడ్డు పక్కన 1012సర్వే నెంబరులోని పొలాన్ని ఎంపిక చేశారు. గతంలో ఆ సర్వే నెంబరును జింకల ఏడుకొండలరెడ్డికి కేటాయించిన డీ ఫారంను ప్రభుత్వం రద్దు చేసి అతనికి మరో చోట భూమిని కేటాయించింది. 1996లో సర్వే నెంబరు 1012 లో 4.02 ఎకరాల భూమిని జూనియర్ కళాశాల ఏర్పాటుకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. శ్మశానానికి ఇబ్బంది అంటూ స్థానికుల నుంచి ఒత్తిడి రావడంతో 1012 సర్వే నెంబరును సబ్ డివిజన్ చేసి 3.22 ఎకరాల భూమిని ట్రస్టుకు, మిగిలిన 0.80 సెంట్లు భూమిని శ్మశానానికి కేటాయించారు.

• నిర్మాణాలు శూన్యం

ట్రస్టుకు కేటాయించిన భూమికి కంచె వేయడంతప్ప అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. కాలక్రమేణా సదరు కళాశాలను 2002లో మూసివేసి ప్రకాశం జిల్లా చీమకుర్తికి తరలించారు. అప్పటి నుంచి కళాశాలకు కేటాయించిన భూముల్లో ట్రస్టు నిర్వాహకులు జామాయిల్ సాగు చేపట్టారు.

• ఆ భూమిపై రియల్టర్ల కన్ను

నాలుగేళ్ల క్రితం కావలి- దుత్తలూరు నేషనల్ హైవే మంజూరు కావడంతో స్థానికంగా ఉన్న రియల్టర్ల కన్ను ఈ భూమిపై పడింది.ఎకరం కోటిన్నరతో 3.22ఎకరాల భూమికి సుమారు 4.6 కోట్లకు బేరం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో పొలంలోని జామాయిల్ చెట్లను తీసేసి ట్రస్టుకు కేటయించిన భూమిచుట్టూ ప్రహరీ నిర్మించి, ట్రస్టు నిర్వాహకులు రియల్టర్లకు భరోసా ఇచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో వింజమూరులోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల సిబ్బంది శనివారం యంత్రాలతో ట్రస్టుకు కేటాయించిన భూములను చదును చేసే పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న జిర్రావారిపాలెం వాసులు ఆ ప్రాంతానికి తరలివచ్చి పనులను అడ్డుకున్నారు. సమాచారం అందు కున్న ట్రస్టు సిబ్బంది ఒంగోలు నుంచి కలిగిరి వచ్చారు. తాము భూములను అమ్మ లేదంటూ గ్రామస్థులకు నచ్చజెప్పాలని చూశారు. అయితే ఏ పనులు చేపట్టినా పత్రికా ముఖంగా ప్రజలకు తెలియజేసి అందరి ఆమోదం మేరకు చేపట్టాలని గ్రామస్థులు తెగేసి చెప్పారు. దీంతో పనులు అక్కడ ఆపేసి ట్రస్టు సభ్యులు వెనుతిరిగారు. ఈ విషయమై గ్రామస్థులు తహసీల్దారు గిరీష్‌కు వినతిపత్రం అందించారు. తమ సిబ్బందిని పంపించి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి, నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తహసీల్దారు తెలిపారు.



జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ సమక్షంలో లక్కీడిప్ తీస్తున్న ఎక్సైజ్ అధికారులు

ప్రశాంతంగా లక్కీడిప్

- 55 బార్లకు 21 దరఖాస్తులు • నేటి రాత్రి నుంచి పాత బార్ల మూత
- రేపటి నుంచి కొత్తవి ప్రారంభం

నెల్లూరు(క్రైం) ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్ల కేటాయింపునకు లక్కీడిప్ నగరంలోని జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం ప్రశాంతంగా సాగింది. జేసీ కే. కార్తీక్ లక్కీడిప్ నిర్వహించి, బార్లను కేటాయించారు. జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 50 బార్లు, గీతకులాలకు సంబంధించి ఐదు బార్లు కలిపి మొత్తం 55 బార్లకు ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తుల గడువు ముగిసే సమయానికి 21 బార్లకు 94 దరఖాస్తులు అందాయి. ఓపెన్ కేటగిరిలో 17 బార్లకు 68, గీతకులాలకు సంబంధించి నాలుగు బార్లకు 26 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజు రూపేణా రూ.4,79,40,000లు, లైసెన్సు ఫీజు రూపేణా రూ.2,21,29,000లు మొత్తం రూ.7,00,69,000 ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. దరఖాస్తులు అందని బార్లకు ప్రభుత్వం రీనోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. బార్‌లు దక్కించుకున్న వారు లైసెన్సుఫీజులో ఆరోవంతు, బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాక ఎక్సైజ్ అధికారులు లైసెన్సులను మంజూరు చేయనున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ ఎం. శంకరయ్య, ఏసీ వీ. దయాసాగర్, ఈఎస్ ఏ. శ్రీనివాసులునాయుడు, ఏఈఎస్‌లు జే. రమేష్, ఆర్. జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

• నేటి రాత్రి నుంచి మూత

జిల్లాలోని 47 బార్లకు ఆదివారం రాత్రితో కాలపరిమితి ముగియనున్నది. సెప్టెంబరు ఒకటి నుంచి కొత్త బార్లు ప్రారంభం కానున్నాయి. దరఖాస్తులు అందని బార్లకు ఎక్సైజ్ అధికారులు ఆదివారం రాత్రి సీల్ చేయనున్నారు.



రామకృష్ణాపురం గిరిజనులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ హిమవంశీ

ఉద్యోగాలేమీ వద్దు.. మా బతుకులు మమ్మల్ని బతకనీయండి !

- సబ్‌కలెక్టర్‌తో రామకృష్ణాపురం గిరిజనులు

ఉలవపాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : 'మాకు ఉద్యోగాలు వద్దు... మమ్మల్ని మీరు ఏమీ ఆదుకోవద్దు... మా బతుకులు మమ్మల్ని బతకనీయండి' అంటూ కరేడు శివారు గ్రామం రామకృష్ణాపురం యానాదులు కందుకూరు సబ్‌కలెక్టర్ దామోర హిమవంశీకి తేల్చిచెప్పారు. శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో ఆయన రామకృష్ణాపురంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఉద్యోగ, ఉపాధి సౌకర్యాలు కల్పిస్తామని, అందుకు సహకరించి వివరాలు అందిస్తే ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఇండోసోల్ కంపెనీకి తప్ప... మీ ప్రభుత్వం మాకు మేలు చేయదని, మా ఇళ్లు, భూములు ఇచ్చేది లేదు. ఉద్యోగాలు కూడా మాకు అవసరం లేదు. మా బతుకులు మమ్మల్ని బతకనీయండని కాలనీవాసులు అన్నారు. మీ ఇళ్లు, భూములు తీసుకోవడానికి రాలేదు, ఉద్యోగ ఉపాధి విషయంలో విద్యావంతులకు మేలు చేసే ఉద్దేశ్యంతో వచ్చినట్లు సబ్‌కలెక్టర్ వివరణ ఇచ్చారు. ఎంత నచ్చచెప్పినా వారు ససేమిరా అనడంతో అధికారుల బృందం వెనుతిరిగింది.

• అధికారుల తీరు దుర్మార్గం

కందుకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): 167బీ హైవే భూసేకరణ విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని మండలంలోని ఓగూరు, పలుకూరు గ్రామాల రైతులు సబ్‌కలెక్టరు హిమవంశీ వద్ద వాపోయారు. భూసేకరణ అభ్యంతరాలపై విచారణ కోసం శనివారం సాయంత్రం ఆయన ఓగూరు సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. బలవంతపు భూసేకరణకు ప్రభుత్వం సిద్ధపడితే మా శవాలను చూడాల్సి వస్తుందని రైతులు హెచ్చరించారు. ఈ సమస్యపై సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు అర్జీలు సమర్పించినా ఫలితం లేద న్నారు. న్యాయమైన ధర చెల్లించకుండా మా భూమిని తీసుకోవాలని చూ స్తే సహించేది లేదని వారు స్పష్టంచేశారు. ఇక్కడి పరిస్థితులను ఉన్న తాధికారులకు నివేదించి న్యాయం చేస్తానని సబ్ కలెక్టరు వారికి హామీ ఇచ్చారు.

ముగిసిన కి'లేడి' విచారణ

పరిశీలించిన ఎస్పీ కృష్ణకాంత్ • సరైన సమాధానాలు రానందున మళ్లీ కస్టడీ కోరే అవకాశం

కోవూరు, ఆగస్టు 30,(ఆంధ్రజ్యోతి): రౌడీషీటరు శ్రీకాంత్ పెరోల్ ఉత్తర్వుల విషయమై, అపార్టుమెంట్ ఆక్రమణ కేసులో ఒంగోలు జైలులో రిమాండులో ఉన్న నిడిగుంట అరుణ పోలీసు కస్టడీ శనివారం ముగిసింది. విచారణ తుదిదశకు చేరుకున్న సమయంలో ఎస్పీ కృష్ణకాంత్ అకస్మాత్తుగా కోవూరు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. అరుణను ఉదయం పదిగంటలకు నెల్లూరు జైలు నుంచి పోలీసుస్టేషన్‌కు తీసుకవచ్చారు. ఏఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలో డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, సీఐ కే సుధాకరరెడ్డి మూడోరోజులపాటు పలు ప్రశ్నలు వేసి ఆమె నుంచి సమాధానం రాబట్టారు. చాలా ప్రశ్నలకు ఆమె తెలియదనీ, మరచిపోయానని చెప్పినట్లు తెలిసింది. పలువురు ప్రముఖులతో పరిచయాలున్నాయని ఒప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పడుగుపాడులోని సాయి ఎన్‌క్లేవ్ అపార్టుమెంటు ప్లాటు ఆక్రమణకు సంబంధించి వివరాల గురించి ఆమెను ఎక్కువ ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. సుమారు 90 ప్రశ్నలు అడిగినట్లు విశ్వసనీయ సమాచారం. రిమాండులో ఉన్న కేసుకు సంబంధించి కాకుండా ఆమెను ఇతర ప్రశ్నలు వేయగా సమాధానాల్ని దాట వేసినట్లు తెలిసింది. అనుకున్న మేరకు సమాచారం పొందలేకపోయినందున తిరిగి ఆమెను కస్టడీకి తీసుకునే అవకాశముందని తెలిసింది. సాయంత్రం 6గంటలు కావడంతో ఆమెకు వైద్యపరీక్షలు చేయించి జైలుకు తరలించారు.



కోవూరు స్టేషన్‌లో అరుణను విచారించి బయటకు వస్తున్న ఎస్పీ కృష్ణకాంత్, తదితరులు

కొన్ని వివరాలే చెప్పారు...

బిల్డర్ వెంకట మురళీ మోహన్‌కృష్ణ పెట్టిన కేసు వివరాలు, ఆమె కుటుంబ, ఆర్థిక నేపథ్యం, వేర్వేరు వ్యక్తులతో పరిచయం గురించి అరుణను అడిగాం. మొత్తం 94 ప్రశ్నలు వేయగా కొన్నింటికే సమాధానం చెప్పారు. ఆమె చెప్పిన సమాధానాల్ని పరిశీలించి తిరిగి కస్టడీకి కోరాలా... లేదా..? అనేది పరిశీలిస్తాం. పరిచయాలనేవి వ్యక్తిగతం. వాటి గురించి అడగలేం. కస్టడీ విచారణలోని అన్ని విషయాలు చెప్పేందుకు వీలుకాదు.

- డీఎస్పీ జీ శ్రీనివాసరావు

శ్రీధర్‌రెడ్డి వ్యవహారంలో లోతుగా విచారణ

- లాడ్జిలో మద్యం సేవిస్తూ వీడియో రికార్డ్
- ఎనిమిది మంది గుర్తింపు
- పోలీసుల అదుపులో ఐదుగురు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని లేపేస్తే డబ్బే డబ్బు.. అంటూ కొందరు రౌడీషీటర్లు చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నగరంలోని మద్రాసు బస్టాండు సమీపంలో ఉన్న ఓ లాడ్జి రూమ్‌లో రెండు నెలల క్రితం సెల్‌ఫోన్‌లో వీడియోను చిత్రీకరించినట్లు సమాచారం. ఆ గదిలో ఎనిమిది మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిలో ఇప్పటికే రౌడీషీటర్ జగదీష్ గంజాయి కేసులో జైలులో ఉండగా, మహేష్, వినిత్, రౌడీషీటర్లు రాజారెడ్డి, జాకీర్, మల్లి, ఫైరోజ్, సాయి గదిలో ఉన్నారు. వారిలో ఐదు గురిని పోలీసులు అదు పులోకి తీసుకొని విచారిస్తున్నారు.

• ఎవరున్నారో నిగ్గు తేల్చాలి ?

వైసీపీ రౌడీమూకలు బరితెగించి ప్రవర్తిస్తున్నారని, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యవహారంలో ఎవరున్నారో నిగ్గు తేల్చాలని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై హత్యాయత్నానికి కుట్ర చేయడం సామాన్యులను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నదన్నారు. రౌడీషీటర్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నా, ఇలాంటి చిల్లర రౌడీలు ప్రజలను భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యూరియా కొరతతో సతమతం

- కందుకూరు సబ్‌డివిజన్‌కు సరిగాలేని కేటాయింపులు

కందుకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్‌లో తీవ్రమైన యూరియా కొరతతో రైతులు సతమతం అవుతున్నారు. వారంక్రితం ఉన్న నిల్వలు కూడా పూర్తిగా అయిపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో యూరియా కొనలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. సబ్ డివిజన్‌లో వేలాది ఎకరాల జామాయిల్, సరుగుడు తోటలతోపాటు వందలాది ఎకరాల్లో పండ్ల తోటలు సాగులో ఉన్నాయి. ఇటీవలి కురుస్తున్న వర్షాలతో భూములు పదును కావటంతో అన్నిరకాల పంటల్లో అంతర్ సేద్యాలు చేసి ఎరువులు వేసేందుకు సిద్ధపడిన రైతులు యూరియాకోసం వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సబ్ డివిజన్ వ్యాప్తంగా 50 టన్నులు కూడా నిల్వలు లేవు. దీంతో ఉన్నతస్థాయిలో సిఫార్సు చేయించిన వారికే యూరియా దొరుకుతున్న పరిస్థితి. అది కూడా బ్లాక్ మార్కెట్‌లోనే అంటే... రైతులు ఎంత దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయశాఖ అధికారులు ప్రస్తుతం పంటలకు యూరియా అవసరం లేదన్న పలాయనవాదంతో బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కందుకూరు నియోజకవర్గానికి కేటాయింపుల్లో అన్యాయం చేస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

శివాలయంలో భారీ అన్న సంతర్పణ

మనుబోలు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో గణేష్ మండపం వద్ద శనివారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చవితి నాటినుంచి ఆలయంలో గణేష్ మండపం ఏర్పాటుచేసి వినాయకుడిని కొలువుదీర్చారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి గజాననుడికి భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈక్రమంలో శనివారం పీర్ల మాదవ్, కవిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల సౌకర్యార్థం భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9909
వెండి కిలో ధర	రూ. 123700
వెండి ఒక గ్రాము	రూ. 126.70



ఇక..అన్ని పన్నులూ ఆన్‌లైన్‌లోనే..

నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో

మనుబోలు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇకనుంచి ఇంటిపన్నులు, కొళాయి పన్నులు మొదలైనవన్నీ ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉంటుందని, అందుకే ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ యాప్ తీసుకువచ్చిందని మనుబోలు డిప్యూటీ ఎంపీడీవో నారాయణ తెలిపారు.

?. ప్ర. మండలంలో ఎన్ని చెత్త సంపద కేంద్రాలు ఎన్ని నడుస్తున్నాయి

!. 19 పంచాయతీలు ఉన్నాయి. అయితే 15 మాత్రమే నిర్వహణలో ఉన్నాయి.నాలుగు పెండింగ్‌లోఉన్నాయి.

?. నాలుగు పంచాయతీలు ఎప్పటికి అందుబాటులోకి తెస్తారు

!. మూడు పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తిచేశారు.షెడ్ల నిర్మాణం కాలేదు. పాత బిల్లులు రాలేదని నిర్మాణాలు ఆపేశారు. వెంకన్నపాళెం స్థల సమస్య వలన అసలు నిర్మాణమే చేయలేదు. ప్రభుత్వంకు నివేది కలు పంపాం.

?. ఇంటింటా పారిశుధ్యం ఎన్ని పంచాయతీల్లో అమలు చేస్తున్నారు. ?

!. మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద 8 పంచాయతీల్లో చేస్తున్నాం. ఇప్పుడు గ్రామాలు చాలా పరిశుభ్రంగా ఉన్నాయి. ఉదయం 6 గంటల నుంచే పంచాయతీ సిబ్బంది విధుల్లోకి వెళుతున్నారు.

?. స్వమిత్వ సర్వేతో ప్రయోజనమేంటి

!. స్వమిత్వ సర్వేను కార్యదర్శులు చేస్తున్నారు. పంచాయతీల్లో గ్రామకంఠాలు, గ్రామ పోరంబోకు స్థలాలలో ఇళ్ళు నిర్మాణం చేసుకుని జీవించేవారిని గుర్తిస్తారు. వారికి ప్రభుత్వం ఆ భూములకు హక్కు పత్రాలు ఇవ్వనుంది. అందుకు స్వమిత్వ సర్వే ఉపయోగపడుతుంది.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..!

● బస్సు షెల్టర్లు లేక ఇక్కట్లు

పొదలకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రయాణీకులు వేచి ఉండే పలు ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అక్కడక్కడ నామమాత్రంగా కనిపించే బస్సు షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఫలితంగా ప్రయాణీకులు మండుటెండలో నిలబడుతున్నారు. వర్షం వస్తే దుకాణాల ముందు నిలబడుతూ ఉండడంతో యజమానులు వారిని అక్కడ కూడా ఉండనివ్వడం లేదు.

● ప్రధాన కూడళ్లలో...

ప్రధాన కూడళ్లలో వాహనాలు వచ్చేంతవరకు ప్రయాణీకులు వేచి ఉండేందుకు బస్ షెల్టర్లు లేవు. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ బస్సుల రాక కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి. వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల పరిస్థితి మరీ దారుణం. దుస్తులతోపాటు పుస్తకాలు తడిసిపోతుండడంతో ఇబ్బందిపడుతున్నారు.



బస్సు కోసం ఎండలో నిలబడిన ప్రయాణికులు

పొదలకూరు గేట్ సెంటర్‌లో, సంగం రోడ్డు కూడలి వద్ద, పంచాయతీ బస్టాండ్‌లో నెల్లూరు బస్సులు ఆగే ప్రదేశంలో షెల్టర్లు లేక అవస్థలు పడుతున్నారు. చుట్టుపక్కల మండల ప్రజలు సొంత పనులపై పట్టణానికి వస్తుంటారు. రోజూ 20 వేల మంది వరకు పట్టణంలో వివిధ పనులు ముగించుకుని స్వగ్రామాలకు వెళ్లేందుకు పలు కూడళ్లలో బస్సులు, ఆటోల కోసం వేచి ఉంటారు.

● ఎక్కడెక్కడంటే...

పట్టణంలోని గేట్ సెంటర్, పంచాయతీ బస్టాండు నెల్లూరు బస్సులు ఆగే చోట, సంగం బస్సులు ఆగే చోట, సంగం రోడ్డు పెట్రోల్ బంకు కూడలి వద్ద ఆయా మార్గాల్లోని కూడళ్లలో బస్సులు, ఆటోల కోసం ప్రయాణికులు వేచి ఉంటారు. ఇక్కడ ఎలాంటి నీడ వసతి లేదు. మహిళలు టాయిలెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల్లో మహిళా ప్రయాణీకుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో బస్ షెల్టర్లు నిర్మించి వసతులు కల్పించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విడవలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముదివర్తి గ్రామ శివారులో ఉన్న మలిదేవి డ్రైన్ కాలువ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి (55) మరణించినట్లు ఎస్‌ఐ నరేష్ కుమార్ యాదవ్ శనివారం తెలిపారు. గత కొద్ది రోజుల నుంచి అతను అనారోగ్యంతో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారని, వివరాల కోసం 9440796326 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

ఇమామ్, మౌజర్ల వేతనాలు చెల్లించాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది నెలలుగా నిలిపివేసిన ఇమామ్, మౌజర్లకు ఇస్తున్న గౌరవ వేతనాలను చెల్లించాలంటూ ఆవాజ్ కమిటీ సభ్యులు శనివారం తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. బుచ్చిరెడ్డిపాళెంలోని సీపీఎం కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీతో నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ మండల కార్యదర్శి మునీర్ అహ్మద్ మాట్లాడుతూ మసీదులలో పనిచేస్తూ ప్రార్థనలు చేసుకునే ఇమామ్, మౌజర్లకు ఇచ్చే గౌరవ వేతనం రూ.7 వేలను నిలిపివేయడం బాధాకరమన్నారు. ప్రతినెలా తప్పకుండా చెల్లిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వేతనాలు నిలిపేసి 9నెలలు కావస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్ప టికైనా చెల్లించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.. అనంతరం కమిటీ సభ్యులు తహసీల్దారు వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జక్రియ, జానీభాష, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌కే. పచాషా, రియాజ్, నజీర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఎంబుక్కులుంటేనే బిల్లులు...

కౌన్సిలర్లు.. కమిషనర్ మధ్య వార్

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని పలువురు కౌన్సిలర్లు కోరగా.. ఆ పనులకు ఎం బుక్కులుంటేనే బిల్లులు చెల్లిస్తామని మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తేల్చి చెప్పారు. అంతేకాదు.. సమావేశం నుంచి అర్ధంతరంగా నిష్క్రమించి గదిలోకి వెళ్ళి తలుపు లేసుకున్నారు. దీంతో పలువురు కౌన్సిలర్లలో అసహనం వ్యక్తమైంది. సమావేశానికి హాజరు కావాలని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ కబురు పంపినా ఆయన ముఖం చాటేయడం గమనార్హం. బుచ్చి నగర పంచాయతీ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో శనివారం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఫోన్ చేసినా స్పందించకపోవడంపై పలువురు కౌన్సిలర్లు కమిషనర్‌ను నిలదీశారు. సమావేశంలో ప్రవేశపెట్టిన మొత్తం 5 అజెండాలను కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడంపై చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి ధన్యవాదాలు తెలిపారు. 16వ వార్డు కౌన్సిలర్ ప్రమీలమ్మ మాట్లాడుతూ బలరాం నగర్‌లో పంచాయతీ పబ్లిక్ స్థలంలో పెన్సింగ్ వేయాల్సిన ప్రహరీకి రూ.20 లక్షలు కేటా యింపు ఎందుకంటూ ప్రశ్నించారు. ఆ డబ్బుతో నగర పంచా యతీలో వీధిలైట్లు, బ్లీచింగ్ వాడకానికి ఉపయోగపడు తుందన్నారు. 16వవార్డులో షాపింగ్ కాంప్లెక్స్ వేలంద్వారా వచ్చిన నగదు వివరాలను కోరగా 3రోజుల్లో చెప్తానని 60 రోజులైనా చెప్పలేదన్నారు. కమిషనర్‌గా బాలకృష్ణ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వీధిదీపాలు కొనలేదన్నారు. ప్రజా అవసరాల కోసం ఫోన్ చేస్తే స్పందించరా... అంటూ కమిషన ర్‌ను ప్రశ్నించారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్లుగా పొన్నలూరు, వేగూరు, కొడిమేర్ల

విడవలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విడవలూరు, పార్లపల్లి, వరిణి పంచాయతీలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లగా పొన్నలూరు పురందర్‌రెడ్డి, వేగూరు చంద్రారెడ్డి, కొడిమేర్ల వెంకటేశ్వర్లుని నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో టీడీపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచాలు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు.ఈ సందర్భంగా చైర్మన్లుగా ఎన్నికైన వారు మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్ట్రన్‌చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి సహకారంతో పదవులు వచ్చాయన్నారు. వారి ఆదేశాల మేరకు రైతులకు సేవ చేస్తామన్నారు.



పొన్నలూరు పురుంధర్‌రెడ్డి



వేగూరు చంద్రారెడ్డి



కొడిమేర్ల వెంకటేశ్వర్లు

క్లస్టర్ సమావేశాలకు హాజరు కావాలి

ఇందుకూరుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తూరు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఇటీవల జరిగిన నిర్మాణాత్మక పరీక్ష మూల్యాంకనం పుస్తకాలను ఉపాధ్యాయులందరూ సమగ్రంగా పరిశీలించి మార్కులు వేసి ఆన్‌లైన్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. విద్యార్థుల జవాబు పుస్తకాలను సీఆర్‌ఎంటీలు స్కానింగ్ చేస్తారన్నారు. టీచర్ హ్యాండ్ బుక్ తప్పనిసరిగా రాయాలని ఆదేశాలు జారీ చేశారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం

రాపూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శ్రీవారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీవారికి అభిషేకాలు నిర్వహించి చందనాలంకార సేవ చేశారు. అనంతరం భక్తులు శ్రీవారి నిజరూపాన్ని దర్శించుకున్నారు. సాయంత్రం ఊంజల్‌సేవ, క్షేత్రోత్సవం నిర్వహించగా, భక్తులకు ఉచిత ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.



శ్రీవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

పొదలకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయునికి తోటి ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని డీఎస్‌ఆర్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సోషల్ టీచర్ యర్రంరెడ్డి నాగిరెడ్డిని శనివారం ప్రధానోపాధ్యాయురాలు శైలజ ఉపాధ్యాయ బృందం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏ 1 పరీక్షలపై సమీక్ష

ఆత్మకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఎఫ్‌ఏ 1 పరీక్షలపై ఐటీడీఏ ఏఎంవో శాంతకుమారి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె ఎఫ్‌ఏ 1 పరీక్షల బుక్‌లెట్ విధానం, టీచర్ హ్యాండ్ బుక్స్ రాయు విధానంపై సూచనలు, సలహాలు అందచేశారు. 10వ తరగతి పరీక్షలపై దృష్టిసారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.



కామాక్షితాయి ఆలయంలో హుండీల లెక్కింపు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి) మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో దేవాదాయ శాఖ అధికారుల అధ్వర్యంలో శనివారం హుండీల ద్వారా భక్తులు సమర్పించుకున్న కానుకలకు లెక్కింపు జరిగింది. మే 27 నుంచి ఆగస్టు 30 వరకు 95 రోజులకు గాను రూ. 50,34,039 మేర ఆలయానికి ఆదాయం చేకూరిందని ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. యూఎస్ డాలర్లు 5, థాయిలాండ్ బాత్ 120, ఉక్రయినియన్ హ్రివ్నియా 150, సింగపూర్ డలర్లు5, కెనడియన్ డాలర్ 15, యూఏఈ దిరామ్స్ 15, సౌదీ రియాల్స్ 5, బంగారు వస్తువులు, 64 గ్రాములు, వెండి వస్తువులు 340 గ్రాములు వెండి వస్తువులను భక్తులు స్వామిఅమ్మవార్లకు హుండీల ద్వారా సమర్పించుకున్నారు. దేవాదాయశాఖ అధికారులు ఇన్స్‌పెక్టర్ నాగమల్లేశ్వర రాజు, స్థానిక ఏపీజీ బ్యాంకు అధికారులు ఆలయ సిబ్బంది సుబ్బరాయుడు అధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత ఉద్యోగులు, రెవెన్యూ, పోలీసు, భక్తులు పాల్గొన్నారు.



హుండీలు లెక్కిస్తున్న అధికారులు

కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వింతపోకడ

సబ్‌రిజిస్ట్రార్‌ను విధుల్లో చేర్చుకోని వైనం ● జూనియర్ అసిస్టెంట్ నిర్వాకం

కోవూరు, ఆగస్టు 30, (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం వింత పోకడ చోటుచేసుకుంది. పదోన్నతిపై కార్యాలయానికి వచ్చిన సబ్ రిజిస్ట్రార్‌ను జూనియర్ అసిస్టెంటు విధుల్లో చేర్చుకోకుండా అడ్డుపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... చాలా కాలం నుంచి కోవూరు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌గా జూనియర్ అసిస్టెంటు ఉదయగిరి శ్రీనివాసులు వ్యవహరి స్తున్నారు. నాయుడుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటు గా పనిచేస్తున్న పులి పెంచలయ్య పదోన్నతిపై సబ్ రిజిస్ట్రార్‌గా కోవూరుకు స్టాంప్స్ అండ్ రెవెన్యూ డిపార్టు మెంటు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు తీసుకుని ఆయన ఉదయం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. తాను బాధ్య తలు స్వీకరించేందుకు వచ్చానని జూనియర్ అసిస్టెంటుకు ఉత్తర్వులు చూపారు. జూనియర్ అసిస్టెంటు ఆయనకు బాధ్యతలు అప్పగించేం దుకు ససేమిరా అన్నారు. కనీసం కుర్చీలో కూ ర్చొనేందుకు కూడా అవకాశమివ్వలేదు. దీంతో ఆయన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో చె ట్ల కిందే ఒంటరిగా చాలా సమయం గడిపారు. కార్యాలయంలోకి వె ళ్ళగా జూనియర్ అసిస్టెంటు శ్రీనివాసులు ఉన్న తాధికారులకు ఫోన్ చేశారు. విధుల్లో చేరి సెల వు పెట్టి వెళ్ళమని ఉన్నతా ధికారులు ఆయనను ఫోన్‌లోనే ఆదేశించారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాలతో కొద్ది సేపు మాత్రమే సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసి, ఆన్‌లై న్‌లో లాగిన్ అయిన తరువాత సెలవు పెట్టి వెళ్ళేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో కార్యాలయా నికి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చిన రైతులు ఇక్కడ సాగుతున్న తంతును ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళారు. వెంటనే ఎమ్మెల్యే రంగంలోకి దిగారు. రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ ఉద్యోగికి ఇలాంటి అన్యాయం జరిగితే సహించేది లేదని గట్టిగా చెప్పారు. దీంతో అధికారులు పులి పెంచలయ్యను సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగేందుకు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర అధికారుల ఆదేశా లతో జిల్లా సబ్ రిజిస్ట్రార్ బాలాంజనే యులు కార్యాలయానికి చేరుకున్నారు. పులి పెంచలయ్యను సబ్ రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చోపెట్టి జూని యర్ అసిస్టెంటు శ్రీనివాసులును మంద లించారు.



జూనియర్ అసిస్టెంటు ఎదుట కూర్చున్న సబ్‌రిజిస్ట్రార్ పెంచలయ్య

C.R.I.M.E N.E.W.S

వివాహిత అనుమానాస్పద మృతి

రాపూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివా రం ఓ వివాహిత అనుమా నాస్పద స్థితిలో మృతి చెందింది. రాపూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అంకుపల్లి మౌనిక (24), భర్త సాయికుమార్ నవాబుపేట ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నారు. భర్త డ్యూటీ నిమిత్తం ఉదయం 9గంటల సమయంలో బయటకు వెళ్లిన తర్వాత మౌనిక కళ్లు తిరిగి కిందపడిపోయిందని, ఆమె అత్త, బంధువులు రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కానీ అప్పటికే మృతిచెందిన మౌనికను పరీక్షించిన వైద్యురాలు ఆమె మెడపై గాయాలు ఉండడం గమనించి పోలీసులకు సమాచా రమిచ్చారు. దీంతో మౌనిక మృతిపై అనుమానం ఉందని పోలీస్ స్టేషన్‌లో బంధువులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతురాలు మౌనిక

గుర్తుతెలియని వ్యక్తి...

నెల్లూరు(క్రైం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్పష్టమైన కారణాలు తెలియదు కాని గుర్తుతెలియని వ్యక్తి బారాషహీద్ దర్గా ప్రాంగణంలో శనివారం మృతి చెందాడు. మృతుడు బులుగు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, లేత బులుగురంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి మృతుడి వివరాల కోసం ఆరాతీస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రిత్విక్ఎన్‌క్లేవ్ వద్ద రైలు పట్టాల సమీపంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. రిత్విక్ ఎన్‌క్లేవ్ సమీపంలో షేక్ రసూల్(23) నివాసం ఉంటున్నారు. ఆయనకు తల్లి, ఇద్దరు అక్కలు, చెల్లెలు, తమ్ముడు ఉన్నారు. అక్కలిద్దరికి వివాహం జరిగి బయటకు వెళ్లగా మిగిలిన వారు అతనితోనే ఉంటున్నారు. రసూల్ నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో వ్యాన్‌క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మద్యానికి బానిసైన ఆయన మద్యం మత్తులో పలుమార్లు ఆత్మహత్యాయత్నాకి పాల్పడ్డారు. అతనిపై అలిగి తల్లి నాలుగు రోజుల కిందట రాజంపేటలోని పెద్ద కుమార్తె మస్తానమ్మ ఇంటికి వెళ్లింది. ఈనెల 29వ చెల్లెలు శిరీషా, తమ్ముడు సాయికృష్ణలు వినాయక విగ్రహాలు చూసుకొని బీవీ నగర్‌లోని రెండో అక్క కామాక్షి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో రసూల్‌కు అతని అక్క కామాక్షి ఫోన్‌చేసి ఇంటికి రమ్మని పిలిచారు. వస్తానని చెప్పిన అతను ఇంటికి వెళ్లలేదు. శనివారం కామాక్షి తమ్ముడు ఇంటి వద్దకు వచ్చింది. తలుపుకు లోపల గడియ వేసుకొని ఉండ టంతో నిద్ర పోతుంటాడని ఆమె పనికి వెళ్లిపోయింది. పని ముగించు కొని తిరిగి వచ్చి చూడగా తలుపువేసే ఉంది. దీంతో ఆమె పక్కనే ఉన్న కిటికీలో నుంచి లోపలకు చూడగా రసూల్ సీలింగ్ ఫ్యాన్‌కున్న ఇనుపపైప్‌కు చీరతో ఉరివేసుకుని ఉండటాన్ని గమనించింది. స్థానికుల సహకారంతో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే రసూల్ మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు కామాక్షి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నిమజ్జనంలో అపశ్రుతి.. వ్యక్తి మృతి

కలిగిరి, ఆగస్టు 30: వినాయక నిమజ్జనానికి వెళ్ళి ప్రమాదవశాత్తూ నీటిగుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని తూర్పు గుడ్లదొనలో గ్రామస్తులు మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించుకొని గురువారం వినాయక విగ్రహ నిమజ్జనానికి సమీపంలోని కొత్త పాలెం వద్ద ఉన్న కెనాల్‌వద్దకు వెళ్ళారు. ఈ క్రమంలో దేవరపల్లి దయాకర్‌రెడ్డి(38) తనపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడం కోసం కాలువలో దిగడంతో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం కనిపించింది. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.



దయాకర్‌రెడ్డి మృతదేహం

నిడిగుంటపాళెంలో వ్యక్తి ...

వెంకటాచలం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిడిగుంటపాళెం డ్రెయిన్ కాలువలో ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిడిగుంటపాళెం గ్రామానికి చెందిన నరసయ్య (54) రెండు రోజులుగా కనిపించకుండా పోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కలంతా గాలించారు. కాలువలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాలు జారి ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుడి కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో ఏపీ 30 పోలీసు యాక్ట్ అమలు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలో ఆదివారం నుంచి ఏపీ 30 పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నామని ఎస్పీ జీ.కృష్ణకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 30వ తేది వరకు ఈ యాక్ట్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా సంఘాలు, యూనియన్లు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వ హించాలంటే ముందస్తు స్థానిక పోలీసు అధికారి అనుమతి పొందాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా సమావేశాలు, ర్యాలీ లు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

బిట్రగుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో గంజాయి తరలి స్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వాహనాల తనిఖీలో భాగంగా కప్పరాళ్ళతిప్ప జాతీయ రహదారి, ఇబ్రహీంపేట సెంటర్‌లో కావలి రూరల్ సీఐ పాపారావు, ఎస్‌ఐ ఎన్ ప్రభాకర్‌రావు తనిఖీలు నిర్వహించగా, ఓ వాహనంలో 6 కేజీల గంజాయి లభించి నట్లు ఎస్‌ఐ ప్రభాకర్‌రావు తెలిపారు. నెల్లూరు, పరిసర ప్రాంతాలకు చెందిన షేక్ సుల్తాన్ బాషా, ఒంటేరు సుమన్ కుమార్, షేక్ ముస్తాక్, షేక్ లతీఫ్ లను అదుపులోకి తీసుకున్నామన్నారు. బోగోలు మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి సమక్షంలో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. నెల్లూరుకు చెందిన నిందితులు నలుగురూ 'కిలేడీ' అరుణకు సన్నిహితులు. కాగా షేక్ సుల్తాన్ బాషా, ఒంటేరు సుమన్ కుమార్ ఇద్దరూ ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు కావడం గమనార్హం.

చేపల అక్రమ వేటపై అధికారుల దాడులు

రాపూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రేగడపల్లి వద్ద అక్రమ చేపల వేటపై శనివారం మత్స్యశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. అనధికారికంగా చేపల వేట సాగిస్తున్నారన్న సమాచారంతో మనుబోలు మత్స్యశాఖ సహాయ పరిశీలకులు కె సంజయ్ స్టీఫెన్ దాడులు చేశారు. పట్టుబడిన చేపలను దాచూరు మత్స్యకార సొసైటీ సభ్యుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. 1200 కేజీల చేపలను వేలం పాట నిర్వహించగా రూ.25వేలు వచ్చినట్లు ఆయన తెలిపారు. అనధికారికంగా చేపల వేటను సాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట దాచూరు మత్స్యకార సొసైటీ సభ్యులు ఉన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 560

తెలుగు భాషా వికాసం కోసం కృషి చేస్తా..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా వికాసం కోసం కృషి చేస్తానని తెలుగు-సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు-సంస్కృత అకాడమీ చైర్మన్‌గా ఆర్‌డీ విల్సన్ ఉరఫ్ శరత్ చంద్రను నియమాకం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో 156 విడుదల చేసింది. నన్ను నమ్మి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి యోగా శిక్షణ

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రీరుషి శక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మినీ బైపాస్ రోడ్డులోని పద్మావతి కల్యాణ మండపంలో ఉచిత యోగా, ధ్యానం శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని నిర్వాహకుడు సీహెచ్.రఘురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ శిబిరం 10 రోజులు జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజల అవసరాలు తీర్చడమే పరిపాలన

● రాష్ట్ర మంత్రి నారాయణ


కాలువను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే పరిపాలన అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. శనివారం నగరంలోని 15, 16వ డివిజన్లలో రాకపోకలు సాగించేందుకు అనువుగా రౌండ్ తూము వద్ద రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 జూన్ నాటికి నగరంలో డ్రైన్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ఆ దిశగా పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రైల్వే ట్రాక్‌ల వద్ద వంతెనల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం గత టీడీపీ హయాంలోనే చేయాల్సి ఉండగా తదుపరి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. నగరంలో ఆరు మదర్‌ప్లాంట్ల ద్వారా 6 లక్షల లీటర్ల సురక్షిత నీటిని ప్రజలకు అందించబోతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకీ ప్రజలు ఇప్పుడు కడుతున్న పన్నులు సరిపోవడం లేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, కమిషనర్ నందన్, నాయకులు అనురాధ, విజేత, కార్పొరేటర్ సుజాత పాల్గొన్నారు.

సిటీప్లానింగ్ డైరెక్టర్ సమీక్ష

నూతన భవనాలకు అనుమతులు సులభతరం చేయాలని రాష్ట్ర సిటీప్లానింగ్ డైరెక్టర్ విద్యులత తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో సిటీప్లానింగ్, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. డివిజన్లు, సచివాలయాల వారీగా నిర్మాణంలో ఉన్న భవనాలను తనిఖీ చేయాలన్నారు. ఆ మేరకు అనుమతులపై ఆరా తీయ్యాలని చెప్పారు. నూతన భవనాలకు సంబంధించి అనుమతులపై స్థానిక యజమానులకు ఉద్యోగులు అవగాహన కల్పించి సులభపద్ధతుల్లో జారీ చేయాలన్నారు. కాగా కనకమహాల్, ట్రంకురోడ్డు ప్రాంతాల్లో పర్యటించిన మేయర్ స్రవంతి అనధికార, అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని సూచించారు.

తెలుగు భాష వైభవాన్ని చాటుతున్న ఉత్సవాలు


తెలుగుభాషాదినోత్సవంలో మాట్లాడుతున్న (ఎడమ నుంచి) డాక్టర్ జయప్రద, డాక్టర్ షమీవుల్లా, ప్రతిమ, జూలూరు గౌరీశంకర్, రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, ఆచార్య కొలకలూరి ఇనాక్

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : వ్యావహారిక భాషోద్యమకారుడు గిడుగు రామమూర్తి 163వ జయంతి సందర్భంగా సేవ సాహితీ సాంస్కృతిక సంస్థ నిర్వహిస్తున్న ఉత్సవాలు తెలుగు భాషా వైభవాన్ని చాటుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం రెండోరోజు ఉదయం అస్తిత్వ వాద సాహిత్యంపై సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆచార్య రాచపాలెం అధ్యక్షోపన్యాసం చేశారు. జూలూరు గౌరీశంకర్, వీ.ప్రతిమ, ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ షమీవుల్లా, డాక్టర్ జయప్రద, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, తదితరులు ప్రసంగించారు. ఈ సభలో జూలూరు గౌరీశంకర్ రచించిన బహుజనగణపమన అనే వచన కావ్యాన్ని ఆవిష్కరించారు. సేవా అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు, డాక్టర్ రేవూరు అనంత పద్మనాభరావు, డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, డాక్టర్ టి.గౌరీశంకర్, తదితరులు అతిథులు, వక్తలకు గౌరవ పురస్కారం అందించారు. పత్ర సమర్పణ కార్యక్రమంలో అతిథిగా నలుబోలు బలరామనాయుడు పాల్గొని డాక్టర్ జీ.పద్మప్రియ, అలహరి మాధవి, కోపల్లె మణి, తాటిచెర్ల రవి, పత్ర సమర్పణ చేశారు. డాక్టర్ కొణిదల శోభ, డాక్టర్ కరుణశ్రీ, సమన్వయకర్తలుగా వ్యవహరించారు. మహిళా సాహితీవేత్తలతో సారస్వత కళానిధి ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి నిర్వహణలో డాక్టర్ డి.లక్ష్మీ సుహాసినీ, డాక్టర్ మైలవరపు లలితకుమారి, డాక్టర్ తాడేపల్లి వీరలక్ష్మి, డాక్టర్ ఎన్‌సీహెచ్.మైథిలి, మాదవపెద్ది గిరిజ, డాక్టర్ వేమూరి సత్యవతి పాత్రధారులుగా తెలుగు సాహిత్య సౌరభాలు సాహితీ రూపకాన్ని ప్రదర్శించారు. అనంతరం మహిళా సదస్సులో తేళ్ల అరుణ, సభాధ్యక్షులుగా వ్యవహరించగా, డాక్టర్ పెళ్లకూరు జయప్రద, డాక్టర్ ప్రభల జానకి, సీ.భవానీదేవి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. పాతూరి అన్నపూర్ణ ఈ సదస్సుకి సమన్వయకర్తగా వ్యవహరించారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడేవారిని ఉపేక్షించొద్దు

● 10 మంది వ్యాపారులకు రూ.3.80 లక్షలు జరిమానా ● 17 హోటళ్లపై క్రిమినల్ కేసులు నమోదు

● ఫుడ్ సేఫ్టీ అధికారుల సమీక్షలో జేసీ కార్తీక్

నెల్లూరురూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న వ్యాపారులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని జేసీ కార్తీక్ ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో ఆయన శనివారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార తయారీ, విక్రయదారులపై తరుచూ ఆకస్మిక దాడులు చేపట్టాలని సూచించారు. వివిధ రకాల ఆహార వ్యాపార సంస్థలపై నిర్వహించిన దాడుల్లో నమోదైన కేసుల్లో శాంపిల్స్ పరీక్షల నివేదిక ఆధారంగా 10 వ్యాపార సంస్థలపై ఆయన రూ.3.80 లక్షల జరిమానాలను విధించారు. నగరంలోని సూపర్‌మార్కెట్ నందు విక్రయిస్తున్న పచ్చళ్లపై ముద్రించిన విషయాలకు, పరీక్షల్లో తేలిన విషయాలకు తేడా ఉండగా తయారు చేసిన ఫ్యాక్టరీకి రూ.లక్ష, అమ్మిన మార్కెట్ వారికి రూ.50 వేలు జరిమానా వేశారు. జాతీయ రహదారి వెంబడున్న ఓ రెస్టారెంట్‌లో గడువు ముగిసిన పదార్థాలు వాడటంతో సదరు యజమానికి రూ.లక్ష జరిమానా విధించారు. ట్రంకురోడ్డులోని ఓ దాబాలో నాణ్యతలేని ఆవు నెయ్యి వినియోగానికి రూ.50 వేలు, నవాబుపేటలోని ఓ సూపర్‌మార్కెట్‌లో నాణ్యతలేని జొన్నపిండికి రూ.20 వేలు, ట్రంకురోడ్డులోని లస్సీ సెంటరులో నాణ్యతలేని పెరుగు వినియోగించడంతో రూ.10 వేలు, సంగం మండలంలోని ఓ డెయిరీలో నాణ్యత తక్కువ గల కోవా తయారీ చేస్తుండటంతో రూ.10 వేలు, అనుమసముద్రంపేటలో ఓ సూపర్‌మార్కెట్‌లో లేబుల్ సరిగాలేని నూనె విక్రయిస్తుండటంతో రూ.10 వేలు జరిమాన విధించారు. కోవూరులోని ఓ ఫ్యాక్టరీలో పచ్చళ్ల తయారీకి ఉపయోగించే నూనెపై లేబుళ్లు సరిగాలేకపోవడంతో రూ. 10 వేలు, నవాబుపేటలోని దుకాణంలో నాణ్యతలేని రాగిపిండి అమ్మినందుకు రూ.10 వేలు, మినీబైపాస్ రోడ్డులోని మరో సూపర్‌మార్కెట్‌లో నాణ్యతలేని బఠాణీలు అమ్మినందున రూ.10 వేలు జరిమానా విధించినట్లు సమీక్ష అనంతరం సహాయ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు తెలిపారు. నిషేధిత రంగులు కలిపిన మాంసాహార, శాఖాహార 17 హోటళ్లను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నీరజ, ప్రణతి ఫ్లోరాలు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఈ-సేవా కేంద్రం


రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు(లీగల్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ-సేవా కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇ సేవా కేంద్రం వల్ల వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులకు సంబంధించి అన్ని వర్గాల వారికి న్యాయపరమైన సమాచారం కోసం ఎంతో ఉపయోగకరమైందన్నారు. కోర్టులకు సంబంధించి న్యాయపరమైన ఆదేశాలు, తీర్పులు కూడా ఈ-సేవా కేంద్రంలో తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

పదవీ విరమణ చేస్తున్న న్యాయశాఖా ఉద్యోగులకు జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ శనివారం న్యాయసేవా భవన్‌లో ఘనంగా సన్మానించారు. నెల్లూరు జిల్లా శాఖా ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రిటైర్ అవుతున్న న్యాయశాఖ ఉద్యోగులు ఉన్నీసాబేగం, నజీమున్నీసాబేగం, ప్రేమ్‌కుమార్‌ల సేవలను అభినందించారు. న్యాయశాఖా ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా, పెండింగ్ బకాయిలు ఉన్న తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయశాఖా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వీవీ.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరపురంలోని 73వ రేషన్ షాపు పరిధిలోని మహిళలకు శనివారం టీడీపీ 53, 54 డివిజన్‌ల క్లస్టర్ ఇంచార్జ్ జహీర్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు షాహిద్, నాయకులు వాసు, బాబు, సుభాహాని, సచివాలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రంగనాథుడికి రూ.4 లక్షల ఆభరణాలు


బంగారు ఆభరణాలు అందజేస్తున్న దాతలు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తల్పగిరి రంగనాథుడికి టీడీపీ నేత ఆనం వెంకట రమణారెడ్డి మిత్రబృందం రూ.4లక్షల విలువ కలిగిన బంగారు ఆభరణాలు అందజేశారు. శ్రీవారికి, అమ్మవార్లకు 34 గ్రాములతో తయారు చేయించిన 2 చైన్లు, 2 తాళి బొట్లు శనివారం ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాస రెడ్డికి అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు పరికరాల అందజేత

నెల్లూరురూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్ పరిధిలోని కల్లూరిపల్లి హౌసింగ్ బోర్డు వెల్ఫేర్ అసోసియోషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు శనివారం పరికరాలు అందచేశారు. దోమల నివారణ, కలుపు మొక్కల తొలగింపు పరికరాలను వెల్ఫేర్ నాయకులు కొనుగోలు చేసి వాటిని పారిశుధ్య విభాగంలో పని చేసే కార్మికులకు అందచేశారు. టీడీపీ నేత అరవ శ్రీను, రాఘవేంద్ర, వెల్ఫేర్ నాయకులు రేవూరు ప్రతాప్ కుమార్, నెల్లూరు సురేష్‌లు మాట్లాడారు. ఇందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకసిరి నాగభూషణం, జహీర్, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

నెల్లూరురూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరు-ముత్తుకూరు రహదారిలో ధనలక్ష్మీపురం సమీపంలో శనివారం వేకువజామున ఓ లారీ బోల్తాపడింది. వివరాల మేరకు.. నెల్లూరు నుంచి ముత్తుకూరుకు వెళుతున్న లారీ అదుపు తప్పి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుకు దూరంగా బోల్తాపడింది. ఆ సమయంలో ట్రాఫిక్ తక్కువగా ఉండటంతో ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఈ రహదారిపై తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మహాగణపతి నిమజ్జనం

● 108 కళాశాలతో మహిళల ప్రదర్శన


మృతికా గణపతికి కలశాలతో తెచ్చిన పెన్నానదీ జలాలతో నిమజ్జనం చేస్తున్న భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం సందర్భంగా నగరంలోని నేతాజీనగర్ 8వ వీధిలో ఏర్పాటు చేసిన మహాగణపతి మట్టి విగ్రహం నిమజ్జనం కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. నేతాజీనగర్ మిత్రమండలి ఆధ్వర్యంలో మహాగణపతి మట్టి విగ్రహంతోపాటు అదే ప్రాంగణంలో మరో వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. మహిళల కుంకుమార్చన, ప్రత్యేక హోమం నిర్వహించారు. 108 కలిశాలలో పెన్నా జలాలు ఉంచి గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 33వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మన్నెం పెంచలనాయుడు, డి.బుజ్జయ్యనాయుడు, తదితరుల పర్యవేక్షణలో 108 మంది మహిళలు, యువత ఆ కలిశాలతో నేతాజీనగర్ 8వవీధి నుంచి ర్యాలీగా బయలుదేరి రాజరాజేశ్వరి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడి నుంచి నిప్పో సెంటర్‌కు చేరుకుని సుబ్బారాయుడు ఉమామహేశ్వరీ ఆలయం, షిరిడీ సాయిబాబా ఆలయాలను సందర్శించి అక్కడి నుంచి నేతాజీనగర్‌లోని గణేష్ మండపాలనికి చేరుకున్నారు. మహిళలు కలశాలలో తెచ్చిన పెన్నా జలాలతో మట్టి గణపతి విగ్రహానికి అభిషేకం చేసి అక్కడే నిమజ్జనం చేశారు. అనంతరం సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మరో గణపతి ప్రతిమకు సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి నగరోత్సవం నిర్వహించి స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్‌లో నిమజ్జనం చేశారు. గణేష్ విగ్రహం వద్ద ఉంచిన లడ్డూకు వేలం నిర్వహించగా రూ.45వేలు పలికింది. ఈ కార్యక్రమాలలో గణేష్ మిత్రమండలి సభ్యులు పోతినేని రాజశేఖర్, మనోజ్, ఎం.జీవన్‌బాలాజీ, ఎం.జస్వంత్, తేజ, డి.సాకేత్, రాఘవ, జె.ప్రశాంత్ పాల్గొన్నారు.

● వైభవంగా విద్యా గణపతి హోమం

నగరంలోని మాగుంట లేఅవుట్ లంబోధర సెంటర్‌లో శనివారం ఉదయం విశేష పూజలు, విద్యా గణపతి హోమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం ఉట్టి మహోత్సవం ఉత్సాహంగా జరిగింది. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం స్వామివారి లడ్డూ వేలం పాట నిర్వహించగా పోటాపోటీగా జరిగిన వేలంలో రూ.13.50 లక్షలు పలికింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ నటులు ఆది పినిశెట్టి, హీరోయిన్ పూజిత పొన్నాడలు హాజరయ్యారు. భక్తులను అలరించడమే కాక వినాయక స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ వేడుకలు లంబోధర గణేష్ ఉత్సవ కమిటీ నాయకులు పర్యవేక్షించారు.

● నిమజ్జనానికి తరలిన గణనాథులు

నగరంలో జరుగుతున్న గణేష్ ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మండపాల వద్ద విశేష పూజలు, హోమాలు, అన్నదానాలు జరిగాయి. సాయంత్రం గణపతులను విశేష పుష్ప విద్యుత్ దీపాలంకరణలతో డీజే, తప్పెట్లు, తీన్‌మార్ మేళాలతో భక్తిగీతాలతో యువత నృత్యాలతో గణేష్ నామస్మరణలతో రంగనాయకుల ఘాట్, మూలాపేట గణేష్ ఘాట్‌లలో వందలాది గణపతులను నిమజ్జనం చేశారు. దీంతో ఆయా ఘాట్ల వద్ద కోలాహలం నెలకొంది. ఉత్సవ నిర్వాహకులకు విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి నాయకులు ఘన స్వాగతం పలికారు. పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి


● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి


కమ్మటి శ్రీనివాసులను సన్మానిస్తున్న డాక్టర్ మాధవి


నెల్లూరు(వైద్యం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి వెల్లడించారు. శనివారం జీజీహెచ్‌లో ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కమ్మటి శ్రీనివాసులకు సన్మాన సభ జరిగింది. శ్రీనివాసులు 44 ఏళ్లుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ఎంతో నిబద్ధతతో పనిచేశారన్నారు. యూనియన్ అధ్యక్షుడుగా ఉద్యోగుల సమస్యల కోసం పోరాడారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బయోకెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ కీర్తి తేజ, డాక్టర్ సార్వారీ, సంధానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజర్ల గౌరవ వేతనం చెల్లించాలి

● డీఆర్వోకి అవాజ్ జిల్లా కమిటీ వినతి



డీఆర్వో హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అవాజ్ కమిటీ నేతలు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : ఇమామ్, మౌజర్లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం చెల్లించాలని అవాజ్ జిల్లా కమిటీ కార్యదర్శి షేక్ రషీద్ కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో కేవలం 6 నెలల గౌరవ వేతనం ఇచ్చారన్నారు. 9 నెలలుగా గౌరవ వేతనం అందలేదన్నారు. టీడీపీ మ్యానిఫెస్టోలో మైనార్టీలకు సబ్సిడీ రుణాలు, 50 ఏళ్లకే పింఛను పథకాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అవాజ్ కమిటీ సభ్యులు షేక్ రియాజ్, సయ్యద్ రవూఫ్, షేక్ సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.



నగర గణపతులు వినూత్నం

నెల్లూరు బట్వాడిపాళెంలో ప్రతిష్ఠించిన అశ్వవాహన గణపతి



బీవీనగర్‌లో ఏర్పాటు చేసిన వినూత్న గణపతి



పెన్నానదీ జలాల కలశాలతో ఊరేగింపుగా వస్తున్న నేతాజీనగర్ గణేష్ భక్తులు

నెల్లూరు నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలకు ప్రజలు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పూజలు చేస్తున్నారు. కొంతమంది మూడో రోజైన శుక్రవారం విగ్రహాలను నిమజ్జనం చేయగా, మరికొందరు శనివారం కూడా నిర్వహించారు. నగరంలోని వినాయక మండపాల్లో మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు మండపాల్లోని విగ్రహాలను దర్శించి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు.



గణేశ్ ఘాట్‌లో క్రేన్‌తో నిమజ్జనం చేస్తున్న వినాయక ప్రతిమ

కావలిలో గుట్టుగా గంజాయి విక్రయాలు

పట్టణ శివార్లు, అటవీ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు

మత్తుకు బానిసవుతున్న యువత, విద్యార్థులు ● భయాందోళనలో తల్లిదండ్రులు

● పట్టించుకోని పోలీసులు

కావలి రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కావలిని కనకపట్నంగా తీర్చి దిద్దుతామంటున్న నేతల మాటలు నీటిపై రాతలుగా మారుతున్నాయి. గుట్టుగా సాగుతున్న గంజాయి, ఇతర మత్తుపదార్థాల అమ్మకాలకు మాత్రం కావలి కేంద్రంగా మారిందని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు. విద్యార్థులను, యువతను లక్ష్యంగా చేసుకుని పట్టణ శివారును అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారని, దీంతో ప్రజల కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. పట్టణంలోని బాలక్రిష్ణారెడ్డినగర్ లోని ఒడిస్సా కాలనీ, పెద్దపవని రోడ్డులోని పీజీసెంటర్ ప్రాంతం, రైల్వేస్టేషన్ పరిసరాలు, ఇందిరానగర్, ముసునూరు ఇందిరమ్మ కాలనీ, జెండాచెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి, మత్తుపదార్థాల పొట్లాల అమ్మకాలు జరుగుతున్నాయని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. అలాగే మత్తువినియోగానికి పట్టణ శివారులోని సుచేతానగర్, పీజీ సెంటర్ ఎదురుగా ఉన్న ఫారెస్ట్ జామాయిల్ తోటలు, అటవీప్రాంతం, ముసునూరు ఇందిరమ్మకాలనీ, జగనన్న లేఅవుట్, కొత్త శివాలయం వెనుక జామాయిల్ తోటలు, తుమ్మలపెంట రోడ్డులోని సుకుమార్ రెడ్డి లేఅవుట్ శివారు లోని పంట కాలువ సమీపం, కావలి చెరువు దగ్గర ఉన్న బ్రంహ్మం గారి గుడి సమీపంలోని అటవీ ప్రాంతం తదితర ప్రాంతాల్లో యువత, విద్యార్థులు నిత్యం మత్తులో ఉంటున్నారు. పట్టణ శివారుపై పోలీస్ నిఘా అంతంత మాత్రంగా ఉండటం, బహిరంగంగానే మద్యం సేవిస్తూ, మత్తులో చిందులు వేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారని సుచేతానగర్, శివరామసుబ్బయ్య కాలనీ వాసులు వాపోతున్నారు.



వైకుంఠపురం ఆర్వోబీ వంతెన సమీపంలో ఇటీవల జీఆర్పీ పోలీసులకు పట్టుబడ్డ గంజాయి(ఫైల్)

● జోరుగా ప్యాకెట్ల అమ్మకాలు

విశాఖ తదితర ఏజెన్సీ ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల్లో కిలోల కొద్ది తెచ్చి సరఫరా చేసే ముఠా ఒకటైతే, వాటిని కొనుగోలు చేసి చిన్నచిన్న ప్యాకెట్లుగా అమ్ముకునే ముఠా మరొకటిగా తయారైంది. వీరు కాలేజీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. మత్తు సరఫరాలో ఆటంకం ఎదురైనప్పుడు పంచర్‌లు వేసే సెల్యూషన్, వైట్‌నర్‌ల వినియోగం ఎక్కువైంది. కానీ మందుల సరఫరా ఏజెన్సీల్లో, దుకాణాల్లో స్పిరిట్, ప్రెమో డాల్ వంటి మత్తుమాత్రలు ఎక్కువగా నిల్వచేసి గుట్టు చప్పుడు కాకుండా కొన్ని మందుల దుకాణాలకు మాత్రమే సరఫరా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పట్టుబడుతున్నా ఆగని గంజాయి సరఫరా

వైకుంఠపురం ఆర్వోబీ వం తెన సమీపంలో బిహార్‌కు చెందిన సూరజ్ కుమార్‌తో పాటు తమిళనాడుకు చెందిన తవామణి బ్యాగులతో జూన్ 23న అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో జీఆర్పీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులు తనిఖీ చేయగా 8 ప్యాకెట్లలో ఉంచిన రూ.3 లక్షల విలువ చేసే 15.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు. ఇలా పట్టుబడుతున్నా మత్తు పదార్థాల సరఫరా మాత్రం ఆగటం లేదు.

> పట్టణ శివారు ప్రాంతాలు, కళాశాలల పరిసరాలపై దృష్టి పెట్టాం శివార్లల్లో డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడైనా మత్తుపదార్థాల అమ్మకం, వినియోగం చేపడుతుంటే డైల్ 100కి సమాచారమివ్వాలి.
> - డీఎస్పీ శ్రీధర్

మత్తుపదార్థాల అమ్మకాలు, వినియోగంపై నిఘా



వైకుంఠపురం ఆర్వోబీ వంతెన కింద మత్తులో పడుకుని ఉన్న యువకుడు

● దాడులకు పాల్పడిన సంఘటనలు అనేకం

కావలి వెంగళరావునగర్‌కి చెందిన ఓ బాలిక పై తుఫాన్ నగర్‌కు చెందిన ఖాదర్ బాషా బ్లేడుతో గొంతు దగ్గర కోయగా త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. కొత్తశివాలయం వెనుక జామాయిల్ తోటలో ముగ్గురు యువకులు గంజాయి సేవించి అక్కడ జరిగిన చిన్న గొడవలో ఒకరి మర్మాంగాలపై పెట్రోల్ పోసి నిప్పంటించగా త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. కోపరేటివ్ కాలనీలో ఉంటున్న తాళ్లూరు వెంకట సత్యన్నారాయణ రాత్రి సమయంలో రైలు దిగి ఇంటికి వెళ్తుండగా, ముగ్గురు యువకులు స్కూటీ పై వచ్చి దాడి చేసి రూ.9000 విలువ గల సెల్‌ఫోన్ తీసుకెళ్లారు. ఇలా అనేక సంఘటనలు వెలుగు చూడటంతో పట్టణ వాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

చిన్నారులకు న్యాయం చేయాలి

ఉదయగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గణనాథుడి నిమజ్జనోత్సవంలో బాణసంచా పేలి తీవ్ర గాయాలపాలైన తొమ్మిది మంది చిన్నారులకు న్యాయం చేయడంతోపాటు అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని శనివారం మండలంలోని అప్పసముద్రంలో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం నిమజ్జనానికి వెళుతున్న తమ వాహనం పక్కనే నడింపల్లి వాహనాన్ని ఉంచి బాణసంచా పేల్చడం దారుణమన్నారు. చెబుతున్నా వినకుండా మద్యం మత్తులో విచక్షణారహితంగా బాణసంచా పేల్చి తొమ్మిది మంది చిన్నారులు తీవ్ర గాయాలపాలయ్యేలా చేశారన్నారు. నలుగురు చిన్నారులకు శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో వారిని చెన్నై తరలించి ప్లాస్టిక్ సర్జరీ చేయించాలని వైద్యులు సూచించారన్నారు. బాణసంచా పేల్చి చిన్నారులను గాయాల పాల్జేసిన పృథ్వీరాజ్, విష్ణులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడంతోపాటు చిన్నారులకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేయాలని వారు డిమాండ్ చేశారు. అలా చేయకపోతే పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయడంతోపాటు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళతామని గ్రామస్థులు హెచ్చరించారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే కాకర్ల

బాణసంచా పేలి గాయాలపాలై ఆత్మకూరు, వింజమూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారులను శనివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించడంతోపాటు అవసరమైన వారిని నెల్లూరు తరలించాలని వైద్యులకు సూచించారు. కొంతమంది చిన్నారుల వైద్యఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు. అలాగే రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనంకి సైతం ఫోన్ చేసి సమస్యను వివరించి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



అప్పసముద్రంలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మాలకొండను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

వలేటివారిపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ లక్ష్మీన్ర సింహస్వామిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘనంగా సత్కరించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు అనంతరం కేశఖండన శాల, లడ్డు కౌంటర్, తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ పరసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆలయంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. దాతలను ప్రోత్సహించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, ఆలయ అభివృద్ధికి తోడ్పాటందించే భక్తులకు ప్రత్యేక పూజలు చేయించాలని తెలిపారు. ఎమ్మెల్యేల వెంట ఆలయ డీసీ చంద్రశేఖర్, నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్, మాదాల మాల్యాద్రి తదితరులు ఉన్నారు.



మాలకొండలో దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్

మాలకొండ ఆదాయం రూ. 10,91,095

మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 10,91,095 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 8,900, కుంకుమార్చన ద్వారా రూ. 22 వేలు, వివాహముల ద్వారా రూ. 3 వేలు, తలనీలాలు ద్వారా రూ. 47,325, వాహన పూజలు ద్వారా రూ. 4,660, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,10,900, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 280, రూము అద్దెల ద్వారా రూ. 30,990, కవర్లు ద్వారా రూ. 7,400, లడ్డుప్రసాదం ద్వారా రూ. 1,79,820, అన్నదానం ద్వారా రూ. 4,45,820, విరాళముల ద్వారా రూ. 30 వేలు ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలియజేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ముందడుగు

● మంత్రి పొంగూరు నారాయణ ● కంటైనర్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

నెల్లూరు(జడ్పీ), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వ్యవస్థలో మార్పులు తెచ్చి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ముందడుగు వేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలోని గాంధీబొమ్మ కూడలిలో శనివారం ఆయన కంటైనర్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరులో మొట్టమొదటి కంటైనర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు అవుతుండడం గర్వంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు ఎల్లప్పుడూ ఆధునిక సాంకేతికతను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా విద్యుత్ లోపాలు తగ్గి, నిరంతరం సరఫరా సాధ్యమవుతుందన్నారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, గృహాలు కలిపి దాదాపు 5 వేల విద్యుత్ కనెక్షన్లకు మెరుగైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు నగర అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. ప్రజలకు తక్షణ ప్రయోజనం చేకూర్చేలా అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఇలాంటి సబ్‌స్టేషన్లు నెల్లూరులోనే కాకుండా జిల్లాలోని ఇతర పట్టణాల్లో కూడా నిర్మించాలనే ప్రణాళిక ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, విద్యుత్ ఎస్‌ఈ వీ.విజయన్, టౌన్ ఈఈ ఎం.శ్రీధర్, ఈఈలు పరంధామయ్య, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ, పక్కన నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు

నేలటూరును త్వరలోనే తరలిస్తాం!


● మెరుగైన పునరావాసానికి కృషి ● గ్రామస్థులతో కలెక్టర్ ఆనంద్ ముఖాముఖి

ముత్తుకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : థర్మల్ కేంద్ర ప్రభావిత గ్రామాలైన నేలటూరు, దళితవాడ పట్టపుపాలెంలను త్వరలోనే తరలి స్తామని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శనివారం ఆయన నేలటూరు, పైనంపురం, కృష్ణపట్నం పంచాయతీల్లో పర్యటించారు. నేలటూరు గిరిజన కాలనీ, పైనంపురం దేవరదిబ్బ గిరిజన కాలనీ, గోపాలపురం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేలటూరు, పైనంపురం పంచాయతీల్లో తమకు పరిశ్రమల స్థాపన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా తమకు సరైన ఉద్యోగావకాశాలు కల్పించలేదన్నారు. గ్రామాల్లో వసతులు, ఇతర సమస్యలపైన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే నేలటూరు పంచాయతీని తరలించి మెరుగైన పునరావాసం కల్పిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. జెన్‌కో థర్మల్ కేంద్రం ఎస్‌ఈఐఎల్ ఎనర్జీస్ యాజమాన్యంతో చర్చిస్తామన్నారు. అనంతరం పట్నం పంచాయతీ గోపాలపురంలో పర్యటించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి వచ్చే కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ గ్రామాన్ని కూడా తరలించాలని స్థానికులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నాగఅనూష, తహసీల్దారు స్వప్న, ఎంపీడీవో నాగమణి, సర్పంచ్‌లు కనకయ్య, కావలి విజయ్‌కుమార్, నాయకులు యానాటి శ్రీనివాసులు రెడ్డి, సాయి శశిధర్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, శివకృష్ణ, మోహన్‌రావు, శోభన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

జడ్పీలో పదోన్నతులు, కారుణ్య నియామకాలు



ఉత్తర్వులను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సీఈవో మోహన్‌రావు

నెల్లూరు(జడ్పీ), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ యాజ మాన్యం పరిధిలో 22 మందికి పదోన్నతులు, ఒకరికి కారుణ్య నియా మకపు ఉత్తర్వులను శనివారం జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అందజేశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జడ్పీలో 22 మందికి ఆఫీసు సబార్డినేట్ల నుంచి రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. ఒకరికి కారుణ్య నియామకపు ఉత్తర్వులను అందజేసినట్లు పేర్కొన్నారు. 2021 నుంచి ఇప్పటి వరకు 155 మంది ఉద్యోగులకు వివిధ హోదాల్లో పదోన్నతులు, 84 మందికి కారుణ్య నియామకపు ఉత్తర్వులు అందించినట్లు తెలిపారు. జడ్పీలో ఎప్పటికప్పుడు పదోన్నతులు, కారుణ్య నియామకాలు త్వరితగతిన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రంగడి పవిత్రోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సెప్టెంబరు 1 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు హోమాలు, తిరుమంజనంలు, గోపురోత్సవాలు జరుగుతాయని భక్తులు అందరూ తరలిరావాలని పేర్కొన్నారు.

సోమశిలకు 21,078 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి శనివారం 21,078 క్యూసెక్కులు వస్తుండగా, 60.716 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,500, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తెలిపారు.

● కండలేరులో 35.990 టీఎంసీల నిల్వ

రాపూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 35.990 క్యూసెక్కులు ఉన్నదని ఏఈ అనీల్‌కుమార్ తెలిపారు. సోమశిల నుంచి 10,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1325 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో ఉందని పేర్కొన్నారు.

తెలుగు భాష వికాసానికి కృషి చేయండి

● మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ● ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి రూ. 5లక్షల విరాళం


వెంకటాచలం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా వికాసానికి కలిసికట్టుగా అందరూ కృషి చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాడభూషి సంపత్ కుమార్ రచించిన కృష్ణ రాయల కీర్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు. తనకు ఉపరాష్ట్రపతి పదవి అనంతరం వస్తున్న పించనులో ఈ కేంద్రానికి రూ. 5 లక్షల నగదును విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలుగువాడిగా పుట్టినందుకు, తెలుగు మాట్లాడుతున్నందుకు, తెలుగువాడిగా వెలుగులోకి వచ్చినందుకు ఎంతో గర్వపడుతున్నానన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి కృషి ఇందుకు అవసరమన్నారు. నెల్లూరు జిల్లాలో ఈ కేంద్రం ఏర్పాటుకు తాను ఎంతో కృషి చేశానన్నారు. కార్యక్రమంలో ప్రాచీన తెలుగువిశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్, వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ అనంత పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణరాయల కీర్తి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు

● వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోండి

మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద అక్షర విద్యాలయంలోని సోమా సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని శనివారం మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు సందర్శించారు. స్వర్ణభారత్ - సోమా సాంకేతిక శిక్షణా కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. యువత వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని వెంకయ్యానాయుడు పిలుపునిచ్చారు.



సోమా సాంకేతిక శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న యువతను పలకరిస్తున్న వెంకయ్యానాయుడు

6న గిరిజనుల కోసం ప్రత్యేక పీజీఆర్ఎస్: కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని సెప్టెంబరు 6వ తేదీన నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచనల మేరకు డివిజన్ స్థాయిలో పీజీఆర్ఎస్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయాల్లో గిరిజనుల సమస్యలు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): బీరు సీసాతో దాడి చేసి గాయపరిచి, కులం పేరుతో దూషించిన ముగ్గురు యువకులపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన చిరితోటి సతీష్‌కుమార్, యశ్వంత్‌లు శుక్రవారం రాత్రి ఉలవపాడులోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వద్ద బైక్‌పై వస్తుండగా ఉలవపాడు గ్రామానికి చెందిన మధు అతని మరో ఇద్దరు స్నేహితులు అడ్డువచ్చి గొడవకు దిగారు. ఆసమయంలో మధు అతని స్నేహితులు బీరు సీసాలతో సతీష్‌కుమార్, యశ్వంతలను కొట్టి గాయపరిచారు. గాయపడిన వారికి స్థానిక సీహెచ్‌సీలో చికిత్స అందించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకు లపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

ఉదయగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్లస్టర్ సముదాయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థిమిత్ర బయోమెట్రిక్ అథెంటిఫికేషన్, అపార్ ఐడీ రిజిస్ట్రేషన్ నూరుశాతం పూర్తి చేయాలన్నారు. అలాగే ఉదయగిరి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సముదాయ సమావేశాలను ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లు సందర్శించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9909
వెండి కిలో ధర	రూ. 123700
వెండి ఒక గ్రాము	రూ. 126.70

శిథిలావస్థలో అన్నారెడ్డిపాళెం వంతెన

- దెబ్బతిన్న సదరన్ చానల్ రివిట్‌మెంట్
- ఆందోళనలో గ్రామస్థులు

సంగం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలం గుండా వెళ్లే సదరన్ (కాలువ) చానల్ గట్లతోపాటు అన్నారెడ్డిపాళెం వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదం పొంచి ఉంది. గత వైసీపీ హయాంలో కనీసం పూడిక తీసిన పాపాన పోలేదు. సాగునీటి కాలువల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అన్నారెడ్డిపాళెం వాసులు ఆందోళన చెందుతున్నారు.



అన్నారెడ్డిపాళెం వంతెనపై పడిన రంధ్రం



వంతెన వద్ద కోతకు గురైన గట్టు

దెబ్బతిన్న కాలువ రివిట్‌మెంట్

ఈ కాలువ నిర్మించి వంద ఏళ్లు కావడంతో కాలువకు పలుచోట్ల రివిట్‌మెంట్ దెబ్బతింది. అంతేకాకుండా అన్నారెడ్డిపాళెం గ్రామస్థుల సౌకర్యార్థం నిర్మించిన వంతెన శిథిలమై కుంగి రంధ్రం పడి ప్రమాదకరంగా ఉంది. వర్షాకాలం కాలువలో ఉధృతంగా వచ్చే నీటి ప్రవాహంతో గట్లు పొంగి ప్రవహిస్తాయి. 2021లో వచ్చిన వరదలకు దిగువ అరవపాళెం వద్ద కాలువకు గండి పడింది. స్థానికులు సకాలంలో స్పందించి ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. దీంతో ప్రమాదం తప్పింది. వైసీపీ హయాంలో ఐదేళ్లు కాలువ గురించి పట్టించుకోలేదు. దీంతో మరింత ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా పాలకులు, ఇరిగేషన్ అధికారులు స్పందించి రివిట్‌మెంట్‌తోపాటు అన్నారెడ్డిపాళెం వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఫజిహా

సీతారామపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఫజిహా అన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీలో తహసీల్దార్ అధ్యక్షతన శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలుంటాయన్నారు. భంగం కలిగించినవారు ఎవరైనా సరే శిక్షార్హులవుతారన్నారు. కుల మతాలకు అతీతంగా అందరు కలిసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ,వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగుల సేవలు అభినందనీయమని గండిపాళెం ఏపీజీబీ బ్యాంకు మేనేజరు షేక్ నజీర్ అన్నారు. శనివారం స్థానిక బ్యాంకులో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మేనేజరుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన కె శోభన్ బాబుతో పాటు బదిలీపై వెళ్లిన ఫీల్డ్ ఆఫీసర్ జీ ఇంతియాజ్ బ్యాంకు అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం శోభన్‌బాబు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లర్కులు అజయ్, రమేష్, మెసెంజరు చినఖాశిం, ఖాతాదారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో పావని

ఆత్మకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ నిమిత్తం శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఆర్డీవో పావని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు ఈ వైద్యశిబిరం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం సమగ్ర శిక్ష సీఎంవో పెంచలయ్య, ఎంఈవో అనంతలక్ష్మి, చలపతి, ఏఎంవో శాంతకుమారి, ఐఈ కో ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు మాట్లా డారు. ఈ కార్యక్రమానికి హాజరైనవారికి సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ భోజన వసతి ఏర్పాట్లు చేశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్ల ఎస్సీ కాలనీలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సౌజన్యంతో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌ను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో స్మార్ట్ రేషన్‌కార్డులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గణనాథుడి సేవలో ఎమ్మెల్యే కాకర్ల

మండలంలోని శంకవరం గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో ఏకదంతాయ యూత్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన గణనాథుడిని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ, మండల నాయకులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఉట్టి మహోత్సవం

సంగం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన విగ్రహాల వద్ద నాల్గవ రోజు శనివారం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా సంగం రాళ్లచెలిక చౌడేశ్వరి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఉట్టి ఉత్సవం కోలాహలంగా జరిగింది.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న జనసైనికులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 30: జనసేన పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సేనతో సేనాని కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి సైతం జనసైనికులు పాల్గొన్నారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పార్టీ అధినేత అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శనివారం ఉదయగిరి మండలం నుంచి పాల్గొన్న షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ సమస్యలు తెలుసుకున్న అధినేత సానుకూలంగా స్పందించారన్నారు. గ్రామ స్థాయిలో నాయకత్వాన్ని పటిష్ఠం చేసేందుకు సమర్థవంతమైన నాయకత్వం అవసరమన్నారన్నారు. ఆ దిశగా కష్టపడి పనిచేసే వారికే పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేసేందుకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. అలాగే తనతో పాటు కొండాపురం, జలదంకి, సీతారామపురం మండలాల నుంచి రమేష్, రామ్మూర్తి, నలుపుల రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారన్నారు.

నేటి నుంచి దొరసానమ్మ గంధ మహోత్సవం

ఏఎస్ పేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా 252వ గంధమహోత్సవాలలో భాగంగా ఆయన సతిమణి హబీబాఖాతూన్ (దొరసానమ్మ) గంధమహోత్సవాన్ని ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం అర్ధరాత్రి గంధమహోత్సవం, సోమవారం చిరాగ, మంగళవారం తహలీల్ ఫాతెహా నిర్వహిస్తారు. సెప్టెంబరు 18,19,20 తేదీలలో నాయబ్ రసూల్ గంధమహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని మహిళల ఆందోళన



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

ఉదయగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరిని జిల్లా చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధి చెక్కనగిషీ కేంద్రం కళాకారులు ప్లకార్డులు చేపట్టి స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, సరిహద్దులు, పేర్ల మార్పులు, చేర్పులకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిందన్నారు. అందులో భాగంగా మంత్రివర్గ ఉపసంఘం జిల్లాల పర్యటన చేస్తోందన్నారు. ఉదయగిరి జిల్లా ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి ఉదయగిరి కేంద్రంగా కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 21 మెట్ట మండలాలను కలిపి జిల్లా చేయాలని వారు కోరారు. అనంతరం డీటీ షాజియాకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో చెక్కనగిషీ కేంద్రం నిర్వాహకులు షేక్ జాకీర్ హుస్సేన్, మహిళలు పాల్గొన్నారు.

●**దుత్తలూరు:** ఉదయగిరిని జిల్లా చేయాలని కోరుతూ శనివారం వైసీపీ, సీపీఎం నాయకులు తహసీల్దారు వై నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శివారెడ్డి, మల్లికార్జున, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలాన్ని అడ్డుకున్న గ్రామస్థులు



ఈవో ఉషశ్రీని ప్రశ్నిస్తున్న నర్రవాడ గ్రామస్థులు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న జనార్ధనస్వామి ఆలయ భూములను కౌలుకు ఇచ్చేందుకు అధికారులు నిర్వహించిన వేలాన్ని శనివారం గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు... ఆలయానికి 93, 297 సర్వే నెంబర్లలో 82.32 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. అధికారులు 2014లో వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన మల్లికార్జున ఆ భూములను ఐదేళ్లపాటు వేలంలో కౌలుకు దక్కించుకున్నారన్నారు. గడువు ముగియడంతో 2019లో వేలం నిర్వహించాలని అధికారులు, ఆలయ కమిటీ నిర్ణయించుకోగా మల్లికార్జున మరో ఏడాది గడువు పొడిగించాలని కోరినా వారు పట్టించుకోలేదు. దీంతో వేలం నిర్వహించడంతో ఆయనకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. వేలంలో ఏలూరుకు చెందిన నాగరాజు కౌలుకు దక్కించుకున్నాడు. అయితే గతనెలలో ఆ వ్యక్తికి ఇచ్చిన గడువు ముగిసినా వేలంలో తిరిగి అతనికే ఆ భూములు ఇచ్చేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారని, ఈవిషయాన్ని తెలుసుకున్న గ్రామస్థులు వేలంపాటను అడుకున్నారు. ఈసందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ మాట్లాడుతూ కౌలుకు తీసుకున్న వ్యక్తి న్యాయస్థానం ద్వారా అనుమతులు తెచ్చుకున్నారన్నారు. అందుకోసం ఆలయ భూములకు సంబంధించిన వేలంపాట నిర్వ హిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీమాధవి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగుచేసే రైతులు సకాలంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉదయగిరి ఏడీఏ లక్ష్మీమాధవి అన్నారు. శనివారం జీ.కొండారెడ్డిపల్లిలో వ్యవసాయ, ఆత్మ శాఖల ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాటాడుతూ వేరుశనగ పంట సాగు చేసే రైతులు ట్యాగ్-24కు బదులుగా 73 రకం వేసుకోవాలన్నారు. ఆ పంటకు వ్యాపించే తెగుళ్లు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం పంటను పరిశీలించి ఆకుమచ్చ తెగులు, రసం పీల్చే పురుగులు ఉన్నట్లు గుర్తించారు. వాటి నివారణకు టేబుకొనజోల్, ఇమిడా క్లోపిరిడ్ ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఈ-పంట నమోదు ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో ఏవో సునీల్, టెక్నికల్ ఏవో వెంకటసుబ్బారెడ్డి, సర్పంచు కుమ్మిత ప్రతాప్ రెడ్డి, వీఏఏ హరనాధ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ 1 పరీక్షలపై సమీక్ష

ఆత్మకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఎఫ్ఏ 1 పరీక్షలపై ఐటీడీఏ ఏఎంవో శాంతకుమారి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె ఎఫ్ఏ 1 పరీక్షల బుక్‌లెట్ విధానం, టీచర్ హ్యాండ్ బుక్స్ రాయు విధానంపై సూచనలు, సల హాలు అందచేశారు. 10వ తరగతి పరీక్షలపై దృష్టిసారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయు లు, అనంతలక్ష్మి, సీఆర్పీలు, ఉపా ధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

ఉదయగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు జే మాధవరావు పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల స్టడీ అవర్స్ నిర్వహణకు టైల్స్ ఏర్పాటుచేసేందుకు 1991-95 పూర్వ విద్యార్థుల సహకారంతో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పూర్వ విద్యార్థి మేరెడ్డి రామకృష్ణారెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. అలాగే బిజ్జంపల్లి క్లస్టర్ పరిధిలోని సంజీవరరాజుపల్లి ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామాంజనేయులు పదవీ విరమణ సందర్భంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కవిత, కమిటీ సభ్యుడు షేక్ నాయబ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన

వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి



సీఐకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే కావ్య అభిమానులు

ఉదయగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, వ్యక్తిగత విమర్శలు చేసిన వైసీపీ నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన అభిమానులు శనివారం ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరామారావుకు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎదుటివారిని విమర్శించే ముందు తమస్థాయి తెలుసుకోవాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, ప్రతిఫలం అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షేక్ సికిందర్, సందానీ, రియాజ్, షరీఫ్, సుభాని, అఫ్రోజ్, అక్బర్‌అలీ, గని తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో మౌజన్లకు గౌరవ వేతనం చెల్లించాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న మౌజన్లు

అనంతసాగరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మసీదుల్లో మౌజన్‌లకు ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లించాలని ఆవాజ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మౌజన్లతో కలసి వారు తహసీల్దారు జయవర్ధన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆరు నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, ఇష్తియార్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

వివాహిత అనుమానాస్పద మృతి



మృతురాలు మౌనిక

రాపూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివా రం ఓ వివాహిత అనుమా నాస్పద స్థితిలో మృతి చెందింది. రాపూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అంకుపల్లి మౌనిక (24), భర్త సాయికుమార్ నవాబుపేట ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నారు. భర్త డ్యూటీ నిమిత్తం ఉదయం 9గంటల సమయంలో బయటకు వెళ్లిన తర్వాత మౌనిక కళ్లు తిరిగి కిందపడిపోయిందని, ఆమె అత్త, బంధువులు రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కానీ అప్పటికే మృతిచెందిన మౌనికను పరీక్షించిన వైద్యురాలు ఆమె మెడపై గాయాలు ఉండడం గమనించి పోలీసులకు సమాచా రమిచ్చారు. దీంతో మౌనిక మృతిపై అనుమానం ఉందని పోలీస్ స్టేషన్‌లో బంధువులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి...

నెల్లూరు(క్రైం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్పష్టమైన కారణాలు తెలియదు కాని గుర్తుతెలియని వ్యక్తి బారాషహీద్ దర్గా ప్రాంగణంలో శనివారం మృతి చెందాడు. మృతుడు బులుగు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, లేత బులుగురంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి మృతుడి వివరాల కోసం ఆరాతీస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రిత్విక్‌ఎన్‌క్లేవ్ వద్ద రైలు పట్టాల సమీపంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. రిత్విక్ ఎన్‌క్లేవ్ సమీపంలో షేక్ రసూల్(23) నివాసం ఉంటున్నారు. ఆయనకు తల్లి, ఇద్దరు అక్కలు, చెల్లెలు, తమ్ముడు ఉన్నారు. అక్కలిద్దరికి వివాహం జరిగి బయటకు వెళ్లగా మిగిలిన వారు అతనితోనే ఉంటున్నారు. రసూల్ నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో వ్యాన్‌క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మద్యానికి బానిసైన ఆయన మద్యం మత్తులో పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అతనిపై అలిగి తల్లి నాలుగు రోజుల కిందట రాజంపేటలోని పెద్ద కుమార్తె మస్తానమ్మ ఇంటికి వెళ్లింది. ఈనెల 29వ చెల్లెలు శిరీషా, తమ్ముడు సాయికృష్ణలు వినాయక విగ్రహాలు చూసుకొని బీవీ నగర్ లోని రెండో అక్క కామాక్షి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో రసూల్‌కు అతని అక్క కామాక్షి ఫోన్‌చేసి ఇంటికి రమ్మని పిలిచారు. వస్తానని చెప్పిన అతను ఇంటికి వెళ్లలేదు. శనివారం కామాక్షి తమ్ముడు ఇంటివద్దకు వచ్చింది. తలుపుకు లోపల గడియ వేసుకొని ఉండటంతో నిద్ర పోతుంటాడని ఆమె పనికి వెళ్లిపోయింది. పని ముగించుకొని తిరిగి వచ్చి చూడగా తలుపువేసే ఉంది. దీంతో ఆమె పక్కనే ఉన్న కిటికీలో నుంచి లోపలకు చూడగా రసూల్ సీలింగ్ ఫ్యాన్‌కున్న ఇనుపపైప్‌కు చీరతో ఉరివేసుకుని ఉండటాన్ని గమనించింది. స్థానికుల సహకారంతో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే రసూల్ మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు కామాక్షి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నిమజ్జనంలో అపశ్రుతి.. వ్యక్తి మృతి



దయాకర్‌రెడ్డి మృతదేహం

కలిగిరి, ఆగస్టు 30: వినాయక నిమజ్జనానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిగుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని తూర్పు గుడ్లదొనలో గ్రామస్తులు మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించుకొని గురువారం వినాయక విగ్రహ నిమజ్జనానికి సమీపంలోని కొత్త పాలెం వద్ద ఉన్న కెనాల్‌వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో దేవరపల్లి దయాకర్‌రెడ్డి(38) తనపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడం కోసం కాలువలో దిగడంతో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం కనిపించింది. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

నిడిగుంటపాళెంలో వ్యక్తి...

వెంకటాచలం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిడిగుంటపాళెం డ్రైయిన్ కాలువలో ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిడిగుంటపాళెం గ్రామానికి చెందిన నరసయ్య (54) రెండు రోజులుగా కనిపించకుండా పోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కలంతా గాలించారు. కాలువలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాలు జారి ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుడి కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో ఏపీ 30 పోలీసు యాక్ట్ అమలు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలో ఆదివారం నుంచి ఏపీ 30 పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నామని ఎస్పీ జీ.కృష్ణకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 30వ తేది వరకు ఈ యాక్ట్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా సంఘాలు, యూనియన్లు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలంటే ముందస్తు స్థానిక పోలీసు అధికారి అనుమతి పొందాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

బిట్రగుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వాహనాల తనిఖీలో భాగంగా కప్పరాళ్లతిప్ప జాతీయ రహదారి, ఇబ్రహీంపేట సెంటర్‌లో కావలి రూరల్ సీఐ పాపారావు, ఎస్ఐ ఎన్ ప్రభాకర్‌రావు తనిఖీలు నిర్వహించగా, ఓ వాహనంలో 6 కేజీల గంజాయి లభించినట్లు ఎస్ఐ ప్రభాకర్‌రావు తెలిపారు. నెల్లూరు, పరిసర ప్రాంతాలకు చెందిన షేక్ సుల్తాన్ బాషా, ఒంటేరు సుమన్ కుమార్, షేక్ ముస్తాక్, షేక్ లతీఫ్ లను అదుపులోకి తీసుకున్నామన్నారు. బోగోలు మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి సమక్షంలో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. నెల్లూరుకు చెందిన నిందితులు నలుగురూ కి'లేడీ' అరుణకు సన్నిహితులు. కాగా షేక్ సుల్తాన్ బాషా, ఒంటేరు సుమన్ కుమార్ ఇద్దరూ ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు కావడం గమనార్హం.

చేపల అక్రమ వేటపై అధికారుల దాడులు

రాపూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రేగడపల్లి వద్ద అక్రమ చేపల వేటపై శనివారం మత్స్యశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. అనధికారికంగా చేపల వేట సాగిస్తున్నారన్న సమాచారంతో మనుబోలు మత్స్యశాఖ సహాయ పరిశీలకులు కె సంజయ్ స్టీఫెన్ దాడులు చేశారు. పట్టుబడిన చేపలను దాచూరు మత్స్యకార సొసైటీ సభ్యుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. 1200 కేజీల చేపలను వేలం పాట నిర్వహించగా రూ.25వేలు వచ్చినట్లు ఆయన తెలిపారు. అనధికారికంగా చేపల వేటను సాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట దాచూరు మత్స్యకార సొసైటీ సభ్యులు ఉన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 560

సబ్ కలెక్టరును మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు

కందుకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీని ఉదయగిరి, కందుకూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావులు శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరిశ్రమల భూసేకరణతో పాటు రెండు నియోజకవర్గాలలోని పలు సమస్యలపై వారు సబ్ కలెక్టరుతో చర్చించారు.


సబ్ కలెక్టరు హిమవంశీతో చర్చిస్తున్న కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్

ప్రజల దాహార్తి తీరేనా...?

- నత్తతో పోటీపడుతున్న ఎస్ఎస్ ట్యాంకు పనులు
- 2007లో నిర్మాణానికి శంకుస్థాపన
- ఇప్పటి వరకు రూ.20 కోట్ల వ్యయం
- ఎప్పటికి పూర్తయ్యేనో...?
- జలదంకి వాసుల కల నెరవేరేనా?

జలదంకి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి దాహార్తితో తజలదంకి మండల వాసులు కోరుతున్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు తలపెట్టిన సమ్మర్ స్టోరేజీ (ఎస్ఎస్) ట్యాంకు పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ఈ ట్యాంకు పనులను వేగవంతం చేసి, ఈ ఏడాదైనా మండల ప్రజల దాహార్తి తీర్చాలని వారు వేడుకుంటున్నారు.

● పూర్తికాని ఎస్ఎస్ ట్యాంకు


2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా, అప్పటి కావలి ఎమ్మెల్యే దివంగత మాగుంట పార్వతమ్మ మండలానికి ఎస్ఎస్ ట్యాంకును మంజూరు చేయించారు. దీని నిర్మాణానికి చినక్రాక గ్రామ పరిధిలోని 14వమైలు సీజేఎఫ్ఎస్ భూములు 52ఎకరాలను 52 మంది లబ్ధిదారుల నుంచి సేకరించారు. సోమశిల ప్రాజెక్ట్ నుంచి నీటిని తరలించేందుకు వీలుగా ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ఎస్ఎస్ ట్యాంకు పూర్తయి ఉంటే మండలంలోని అన్ని గ్రామాల్లోని ఇంటింటికి శుద్ధి జలాలు చేరేవి. ప్రజల దాహార్తి తీరేది.

● ఏళ్లు గడుస్తున్నా...

పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా, నేటికీ పూర్తికాలేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎస్ఎస్ ట్యాంకు పనులు మాత్రం అసంపూర్తిగానే ఉన్నాయి. ఇప్పటి వరకు దీని నిర్మాణానికి రూ.20కోట్లు మంజూరయ్యాయి. కానీ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. ట్యాంకు అంతా కంపచెట్లతో నిండి ఉంది.దీంతో ట్యాంకు వద్ద జరిగిన సివిల్ పనులు నిరుపయోగంగా మారాయి.మోటార్లు తుప్పు పట్టిపోయాయి.


చినక్రాక గ్రామ పరిధిలోని 14వమైలు వద్ద నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు


కంప్రతుమ్మ చెట్లతో నిండిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు


కావలి కాలువ నుంచి పైపులైను ద్వారా సోమశిల జలాలను చేర్చే సంపు

● పూర్తయిన పైపులైను

ఎస్ఎస్ ట్యాంకుకు కావలి కాలువ ద్వారా సోమశిల జలాలు తరలించేందుకు పైపులైను పనులు కూడా పూర్తయ్యాయి. కాలువకు మోటార్లు ఏర్పాటు చేసేందుకు కూడా సిద్ధ చేశారు. కానీ మధ్యలో పనులు ఆగాయి. దీంతో చేసిన పనులన్నీ వృథా అయ్యాయి. ఈ ప్రాజెక్ట్ మధ్యలోనే నిలిచిపోవడంతో మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా లక్ష్యం నెరవేరేనా..? అని వారు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఈ ట్యాంకు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

రైతులకు శిక్షణ తరగతులు

అల్లూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయ రంగంపై పటిష్ట అవగాహన కల్పించేందుకు 'ఆత్మ' ఆధ్వర్యంలో శనివారం శిక్షణతరగతులు నిర్వహించారు. అల్లూరు మండలం పురిణి కొత్తపాలెంలో జరిగిన శిక్షణా తరగతుల్లో వ్యవసాయాధికారి వేంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. సాగులో మెళకువలు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పెంచల వీరేంద్ర, ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ పురుషోత్తం, ఆత్మ ప్రతినిధులు, వీఏఏలు పాల్గొన్నారు.

జిల్లా వైసీపీ ఐటీ జనరల్ సెక్రటరీగా బ్రహ్మారెడ్డి

లింగసముద్రం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కేసంరెడ్డి బ్రహ్మారెడ్డిని జిల్లా వైసీపీ ఐటీ విభాగం జనరల్ సెక్రటరీగా నియమించారు. ఈమేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని ఆయన శనివారం తెలిపారు. పార్టీలో తన సేవలను గుర్తించి తనను ఈ పదవిలో నియమించేలా ఆదేశించిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు, ఈ పదవి తనకు వచ్చేలా సహకరించిన మండల వైసీపీ అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య ఇతర వైసీపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి

వలేటివారిపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని పోకూరులో బడి ఈడు పిల్లలను గుర్తించి ఎంఈఓ, ఉపాధ్యాయులు వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్చేలా కృషిచేశారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు పర్రె రామారావు, నాగభూషణం నోట్‌పుస్తకాలు, పాఠశాలకు నాలుగు కుర్చీలు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

బార్‌లకు ఆదరణ కరువు

● నాలుగు బార్లలో మూడింటికే లాటరీ

కందుకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో నూతన బార్ పాలసీకి అనుగుణంగా ప్రభుత్వం నాలుగు బార్‌లకు అనుమతి ఇవ్వగా ఔత్సాహికుల నుంచి ఆశించిన డిమాండ్ రాలేదు. బార్ లైసెన్సుల కోసం తొలుత ఇచ్చిన గడువులోగా ఎవరూ డీడీలు చెల్లించకపోవటంతో మరో మూడురోజులు సమయం ఇచ్చినప్పటికీ ఆశించిన స్పందన రాలేదు. నాలుగు బార్‌లలో ఒక్క బార్‌కు ఒక్కటే దరఖాస్తు రావటంతో దానిని శనివారం కూడా లాటరీ నుంచి మినహాయించారు. మిగిలిన మూడింటిలో ఒకటి గీతకార్మికుల కోటాలో 50శాతం లైసెన్సు ఫీజు రాయితీ ఉండటంతో ఆ షాపుకోసం వ్యాపారులు పోటీపడ్డారు. దీనికి ఐదు దరఖాస్తులు రాగా లాటరీలో నెల్లూరుకు చెందిన మద్యం వ్యాపారి బి. జనార్ధన్ అనే గీతకార్మికుడి పేరుతో సంపాదించుకున్నట్లు తెలిసింది. ఇక మిగిలిన రెండు బార్‌లలో ఒకటి ఆర్టీసి బస్టాండ్ సమీపంలో ప్రస్తుతం బార్ నిర్వహిస్తున్న హనుమారెడ్డి దక్కించుకోగా మరో బార్‌ను కొండముడుసుపాలెంకు చెందిన శ్రీకాంత్ అనే యువకుడు దక్కించు కున్నట్లు తెలిసింది. ఈ రెండు బార్‌లకు కూడా తగినన్ని దరఖాస్తులు రాకపోవటంతో ఒక్కరే నాలుగేసి దరఖాస్తులు వేసి లాటరీకి మార్గం సుగమం చేసుకోవటం ద్వారా దక్కించుకున్నట్లు తెలిసింది. మిగిలిన మరో బార్‌కు మరింత సమయం ఇవ్వటంతో దీనిని కనిగిరి రోడ్డులో ఇప్పటికే ఈ వ్యాపారంలో ఉన్న టీడీపీ నేత పోటీలేకుండా స్వంతం చేసుకునేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

నాసిరకంగా పనులు చేస్తే రైతులకు నష్టం

దగదర్తి (బిట్రగుంట): నాసిరకంగా కాలువ పనులు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలంలోని డీఆర్ ఛానల్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. పనులలో నాణ్యత కొరవడిందని, ఇలాగైతే డీఆర్ ఛానల్‌పై ఆధారపడిన 23 వేల ఎకరాల్లో రైతులు నష్టపోతారని తెలిపారు. సాగునీటి కోసం రైతులు పడుతున్న కష్టాలను చూసి సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేస్తే, వైసీపీ ప్రభుత్వంలో కాలువను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఆయన వెంట స్థానికులు, రైతులు ఉన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా : తప్పిన ప్రమాదం

వలేటివారిపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు సమీపంలోని జాతీ య రహదారి మార్జిన్‌లో శుక్రవారం తెల్లవారుజామున అదుపుతప్పి లారీ బోల్తా పడింది. డ్రైవర్ నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడంతో ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవ డంతో దీంతో ఘోర ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.

వినాయకస్వామికి ఎమ్మెల్యే ఇంటూరి ప్రత్యేక పూజలు

లింగసముద్రం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సాయంత్రం గ్రామంలోని వినాయకస్వామి మండపం కమిటీ ఆహ్వానం మేరకు గ్రామానికి వెళ్లి స్వామి వారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావును నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, కేపీ నరసింహారావు, మలిశెట్టి నాగేశ్వరరావు, సయ్యద్ నాయబ్‌రసూల్, శ్రీనివాసులు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.


పెదపవనిలో వినాయకస్వామి మండపం వద్ద భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

రైతులకు మేలు చేసేందుకే ఏఎంసీలు : ఎమ్మెల్యే

● కావలి మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కావలి, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయదారులకు అండగా నిలిచి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకే ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒక వ్యవసాయమార్కెట్ కమిటీని ఏర్పాటు చేసిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని మద్దూరుపాడు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఆవరణలో శనివారం కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్‌పర్సన్‌గా పోతుగంటి అలేఖ్య, వైస్‌చైర్మన్‌గా చంచం గారి శ్రీనివాసులు, 12 మంది డైరెక్టర్లుగా ఎమ్మెల్యే సమక్షంలో వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యదర్శి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణస్వీకారం చేసిన డైరెక్టర్లలో తుమ్మల రమణమ్మ, కొప్పోలు లక్ష్మీ, లేళ్లపల్లి సుధీర్ కుమార్, మొగిలి విజయకుమార్, డీఎం పవన్‌కుమార్, సూరే జయశ్రీ, దద్దాల ప్రభాకర్, గణేశం రమేష్ రెడ్డి, జమ్ముల యల్లమ్మ, భూక్యా ప్రసాద్‌నాయక్, తాళ్లూరు విజయమ్మ, హెప్సిబా ఉపిరేంతి, పెనుమల్లి శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు. వీరందరినీ ఎమ్మెల్యే సత్కరించారు. ముఖ్యఅతి థిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పాలక వర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ సేవలపై రైతులకు తరచూ అవగాహన కల్పిస్తూ అండగా నిలవాలన్నారు. కావలి వ్యవసాయ మార్కెట్‌కు ఏటా సెస్ ద్వారా రూ.7 కోట్ల వరకు ఆదాయం వస్తోందన్నారు. ప్రస్తుతం మార్కెట్ కమిటీలో రూ.16 కోట్లు నిధులు ఉన్నాయని, వాటిలో రూ.6 కోట్ల వరకు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. చైర్‌పర్సన్ అలేఖ్య ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించి అభివృద్ధి పనులు జరిగేలా చూడాలన్నారు. దగదర్తి, అల్లూరు మండలాల్లో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు. చైర్‌పర్సన్ అలేఖ్య మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం కృషి చేస్తానన్నారు.


ఏఎంసీ చైర్‌పర్సన్ అలేఖ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

మద్దూరుపాడు సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కావలి రూరల్ మండలం మద్దూరుపాడు సొసైటీ నూతన చైర్మన్‌గా గుంటూరు మల్లి కార్జున, సభ్యులుగా పాపనబోయిన సుబ్బారావు, కొమరా వెంకటేశ్వర్లు చేత ఆ సొసైటీ సీఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొని సొసైటీ ద్వారా రైతులకు సేవలు అందించాలని నూతన సభ్యులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎస్పీ పీ. శ్రీధర్ టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబు నాయుడు. బీతా గిరిదర్, పొట్లూరి శ్రీనివాసులు, మొగిలి కల్లయ్య, తటవర్తి రమేష్, పాలిశెట్టి, మాలేపాటి నాగేశ్వరరావు, ఆవుల రామక్రిష్ణ, బీజేపీ నేతలు కందుకూరి వెంకటసత్యనారాయణ, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కొతలోక' చిత్రం పేరు.. తెలుగు భాషకు అవమానం!

కావలి(టౌన్) ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) తెలుగు భాషా దినోత్సవం రోజే విడుదలైన తెలుగు సినిమా 'కొతలోక' తెలుగు భాషను ఖూనీ చేసేలా ఉందని తెలుగు భాషాభిమానులు నిరసన తెలిపారు. శనివారం వేంకటేశ్వర థియేటర్ వద్ద తెలుగు భాషాభిమానులు 'కొతలోక' సినిమా పోస్టర్ కు పూలమాల వేసి, మేనేజర్‌కు పూలబొకే అందించి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఇతర భాషల సినిమాలైతే ఎటువంటి పేర్లు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని, అర్థమే లేని పేరు పెట్టడం తెలుగు భాషను అవమానపర్చడమేనన్నారు. తమ ఆవేదనను దర్శక, నిర్మాతలకు తెలపాలని థియేటర్ మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎస్ జయ ప్రతాప్‌రెడ్డి, 'అమ్మ' ఆదరణ సంస్థ అధ్యక్షులు నున్నా మురళి, బీసీ ఐక్యభవన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, వరప్రసాద్ పాల్గొన్నారు.


మేనేజర్‌కు పుష్పగుచ్ఛం అందించి నిరసన తెలుపుతున్న తెలుగు భాషాభిమానులు

ఏఎంసీ డైరెక్టర్‌గా తాళ్లూరు విజయమ్మ

దగదర్తి (బిట్రగుంట) ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం కాట్రాయిపాడుకు చెందిన టీడీపీ రైతునేత తాళ్లూరు సుధాకర్‌నాయుడు సతీమణి తాళ్లూరు విజయమ్మను కావలి ఏఎంసీ డైరెక్టర్‌గా ఎంపిక చేయడం పట్ల పలువురు నేతలు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శాలువా కప్పి ఆమెను అభినందించారు. మండల టీడీపీ కన్వీనర్ అల్లం హనుమంతరావు, నెల్లూరు పార్లమెంట్ రైతు కార్యదర్శి జలదంకి శ్రీహరినాయుడు, చవటపుత్తేడు సర్పంచు పులిశీనయ్య, కాట్రాయిపాడు నీటిసంఘం అధ్యక్షుడు మోహన్‌రావు, యువనేత వడ్డే వినయ్‌కుమార్ తదితరులు విజయమ్మ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటకు చెందిన టీడీపీ నేత లేల్లపల్లి సుధీర్‌బాబు, ఏనుగులబావి పంచాయతీ జడగోగులకు చెందిన జే ఎల్లమ్మలను కావలి ఏఎంసీ డైరెక్టర్లుగా ఎంపిక చేయడంతో పలువురు టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.


తాళ్లూరు విజయమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

ముగిసిన ఇన్ఫోసిస్ సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ శిబిరం

బిట్రగుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో ఇన్ఫోసిస్ సాఫ్ట్ స్కిల్స్ శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఇన్ఫో సిస్ ఫౌండేషన్, ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో ప్రసిద్ధ ట్రైనర్ చంద్రవదన 20 గంటలపాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎన్ రెడ్డి మాట్లాడుతూ ఫినిషింగ్ స్కూల్ ఆఫ్ ఎంప్లాయబిలిటీ కార్యక్రమం కింద ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసీటీ అకాడమీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారన్నారు. కమ్యూనికేషన్, టైమ్ మేనేజ్‌మెంట్, సమస్య పరిష్కార నైపుణ్యాలు వంటి కీలక అంశాలను విద్యార్థులకు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే. రాజారెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఎస్‌పీవోసీ డాక్టర్ సత్యనారాయణరెడ్డి, పీ బృందావని తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ట్రైనర్ చంద్రవదన

నా జోలికి వస్తే కాకాణి, పర్వతరెడ్డి అవినీతి చిట్టా విప్పుతా!

● విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, ఆగను 30 (ఆంధ్రజ్యోతి) 'నా జోలికి వస్తే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిల అవినీతి బాగోతం చిట్టా విప్పుతాను' అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఇప్పటివరకు ఒక్క కేసు కూడా లేదన్నారు. క్రిష్ణపట్నం పోర్టు టోల్‌గేట్ నుంచి పోర్టరీ సంతకాలు, కోర్టులో ఫైళ్ల మాయం వరకు కాకాణి అవినీతి చిట్టా అంతా బయటకు తీస్తానన్నారు. అలాగే పర్వతరెడ్డి నెల్లూరు నడిబొడ్డులో అక్రమంగా కూడకట్టుకున్న ఆస్తులు, ఆయన విద్యాసంస్థల లెక్కలు, పదో తరగతి పేపర్‌లీక్ వరకు ఆయన బాగోతం బయటపెడతానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తన క్రషర్ సీజ్‌చేసి 147 కోట్లు పెనాల్టీ విధిస్తే తాను కోర్టుకు వెళ్లగా, ఆ ప్రభుత్వంలోనే తనకు క్లీన్‌చిట్ ఇచ్చారన్నారు. కావలిలో తాను చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. ప్రతాప్‌రెడ్డి తన క్రషర్, మామిడి తోటలపై డ్రోన్ చిత్రీకరించి, తనను హత్య చేయించటానికే తన అనుచరులైన రౌడీషీటర్లు, మరి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులను తన క్రషర్ వద్దకు పంపారన్నారు.

టీఆర్ఆర్‌లో తెలుగుభాష, క్రీడాదినోత్సవం

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం తెలుగుభాష, జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజులుగా పీడీ కేఆర్ కరుణకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఏడుకొండలు నరేంద్ర, అధ్యాపకులు పీ. రాజగోపాలబాబు, ఎన్వీ శ్రీహరి, కే. నరేష్‌రాజా పాల్గొన్నారు.

వైభవంగా గణపయ్యల నిమజ్జనం


నిమజ్జనానికి వెళ్తున్న గణపయ్య

కావలి రూరల్: కావలి మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. వినాయక మండపాల్లో పూజల అనంతరం గణనాథులను తుమ్మల పెంట, కొత్తసత్రం, చెన్నాయి పాలెం తీర ప్రాంతాలకు నిమజ్జనానికి తరలించారు. తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ పోలీసులతోపాటు మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

లింగసముద్రం : మండలంలో గణనాథుని నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. శనివారం మధ్యాహ్నం మండలంలోని వాకమళ్లవారిపాలెం, లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలలో వినాయకుని విగ్రహాలను ట్రాక్టర్లలో ఊరేగించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● గణనాథుడి సన్నిధిలో అన్నదానం

అల్లూరు: వినాయక చవితిని పురస్కరించుకొని స్థానిక కోనేటిసత్రం గణపతి విగ్రహ సన్నిధిలో శనివారం అన్నదానం నిర్వహించారు. నాలుగోరోజు ప్రత్యేక పూజలతోపాటుఅన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కమనీయంగా కల్యాణం

రాపూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శ్రీవారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీవారికి అభిషేకాలు నిర్వహించి చందనాలంకార సేవ చేశారు. అనంతరం భక్తులు శ్రీవారి నిజరూపాన్ని దర్శించుకున్నారు. సాయంత్రం ఊంజల్‌సేవ, క్షేత్రోత్సవం నిర్వహించారు.



బోటింగ్ డ్రెస్‌లో చంద్రబాబు



పరమ సముద్రం చెరువులో చంద్రబాబు బోటింగ్



హంద్రీ-నీవా కాలువ వద్ద జనం హర్షాతిరేకాల నడుమ జలహారతి ఇస్తున్న చంద్రబాబు

నిలువెల్లా పులకింత... జనమెల్లా కేరింత!

- జలహారతిలో మెరిసిన 'చంద్ర'హాసం
- సీఎం కుప్పం పర్యటన విజయవంతం

పంచెకట్టులో నిండైన రూపం.. పెదవులపై చెరగని దరహాసం..ఆనందంతో జనాలకు అభివాదం.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటిలా కాకుండా భిన్నంగా కనిపించారు, వ్యవహరించారు. అధినేతకు జేజేలు.. ప్రాంగణమంతా ఈలలు.. మాటమాటకీ పట్టలేని ఆనందంతో గోలగోలలు.. జడత్వాన్ని వదుల్చుకున్న జనం ఆయనకు బ్రహ్మరథం పట్టారు. చంద్రబాబులో ఎన్నడూ లేని పులకింత కనిపించగా.. జనంలో నిస్తేజం పటాపంచలై కేరింతలతో వెల్లువెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఎప్పటిలా కాకుండా, నూతనత్వంతో ఆద్యంతం ఉత్సాహం ఉరకలు వేసేలా విజయవంతంగా సాగి ముగిసింది.



సభకు హాజరైన జనం- చంద్రబాబు అభివాదం



హంద్రీనీవా పైలాన్ ఆవిష్కరణ

కుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 738 కిలోమీటర్లు సాగి, తరలి వచ్చిన కృష్ణమ్మకు కుప్పంలోని పరమసముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా కాలువలో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం జలహారతి ఇచ్చారు.ఆ సమయంలో ఆయన ఆహార్యం చూసిన జనం ఆశ్చర్యపోయారు. శాంతిపురం మండలంలో ఇటీవలి స్వగృహ ప్రవేశంలో తప్ప, ఆయన కుప్పం ప్రజలకు ఎన్నడూ, ఏ కార్యక్రమంలోనూ పంచెకట్టులో కనిపించకపోవడం, ఇప్పుడు నిండైన పంచెకట్టుతో కనువిందు చేయడమే వారి ఆశ్చర్యానికి కారణం. కేవలం జలహారతి సమయంలోనూ కాదు.. తర్వాత జరిగిన బహిరంగ సభలో కూడా ఆయన పంచెకట్టు, షర్టుతోనే పాల్గొనడం వారిలో మరింత ఆశ్చర్యంతోపాటు ఆనందాన్ని కలిగించింది. తెలుగు సంప్రదాయంలో గంగమ్మను పూజించుకోవడమే కాక, సంప్రదాయ దుస్తులను పర్యటన ఆద్యంతం ధరించడం ప్రధాన విశేషంగా ప్రజలు చెప్పుకున్నారు. అంతేనా.. చంద్రబాబు ప్రసంగం ఎప్పటిలా హైహై గా సాగలేదు. జలాలు.. పొలాలు.. హలాలు.. ఆయన వాక్యంలో అడుగడుగునా పలకరించాయి. సభ ప్రారంభంనుంచి ముగిసే వరకూ ఆయన పెదవులపై సంతృప్తికర హాస రేఖలు తొంగిచూశాయి. షెడ్యూల్ ప్రకారం చంద్రబాబు కచ్చితంగా ఉదయం 10.30గంటలకు శాంతిపురం మండలం కడపల్లె వద్ద గల ఇంటినుంచి బయటకు వచ్చి వివిధ పథకాల లబ్ధిదారులతో అప్పటికే నిండిన ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఒక కుటుంబ సభ్యుడిలా వారిని పలుకరిస్తూ, కష్టసుఖాలు ఆరాతీస్తూ, పథకాల ద్వారా పొందుతున్న లబ్ధి వివరాలు తెలుసుకుంటూ పరమసముద్రం చెరువు వద్దకు చేరుకున్నారు. సమీపంలోని హంద్రీ-నీవా కాలువలో ముహూర్తం వేళ అయిన ఉదయం 11.30 గంటలకు జలహారతి ఇచ్చి కృష్ణమ్మకు పూజలు చేశారు.తర్వాత పైలాన్ ఆవిష్కరణకు ముందు హంద్రీ-నీవా రూట్ మ్యాప్ పరిశీలించారు. సంబంధిత ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్ సందర్శించారు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు ఆయా వివరాలను సీఎంకు వివరించారు. కాలువ పొడవునా సీసీ కెమెరాలు పెట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని, హంద్రీ-నీవా కాలువ ప్రయాణం, అందుకు ప్రభుత్వం పడిన ఇబ్బందులు, సాధించిన విజయాలు, ఫలితాలను సూచించేలా, చిన్నలు పెద్దలకు అర్థమయ్యేలా నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర కేంద్రాలలో ప్రత్యేకమైన ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అందుకు ఎంత వ్యయమైనా భరించేందుకు తాను సిద్ధమన్నారు. అనంతరం హంద్రీ-నీవా కాలువ నిర్మాణం పూర్తయి కృష్ణా జలాలు కుప్పం చేరినందుకు గుర్తుగా నిర్మించిన పైలాన్‌ను ఉదయం 11.50 గంటలకు ఆవిష్కరించారు.అనంతరం చంద్రబాబు జనాల ఆనందాన్ని పంచుకుంటూ వారితో కలిసి సెక్యూరిటీ లేకుండా కాలువ గట్టు వెంట పరమసముద్రం చెరువు వద్దకు నడుచుకుంటూ వెళ్లిపోయారు. అక్కడ అప్పటికప్పుడు సిద్ధం చేసిన బెలూన్ తెప్పలో ఎక్కి చెరువంతా కలియ దిరిగారు. ఈ కార్యక్రమం షెడ్యూల్‌లో లేకపోయినా ఆయనలో ఉరకలు వేసే ఉత్సాహం ఈ పనిచేయించింది. తర్వాత సుమారు గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.45 గంటలకు బహిరంగ సభావేదికకు చేరుకున్నారు.

● ఉరవడిగా సాగిన ప్రసంగం

సాధారణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం పడికట్టు పదాలతో పునరావృతమయ్యే వాక్యాలతో సాగుతుంది. అయితే జలహారతి సందర్భంగా ఆయన ప్రసంగం ఒక ఉరవడిలో, హంద్రీ-నీవా కాలువలో ఉరకలెత్తే కృష్ణా ప్రవాహంలా సహజ ఉధృతితో సాగింది. మధ్యాహ్నం 1.32 గంటలకు ప్రారంభమైన ఆయన ప్రసంగం ఏకధాటిగా సుమారు 1.15 గంటపాటు కొనసాగి మధ్యాహ్నం 2.45 గంటలకు ముగిసింది. జలాలే జీవితం అని ప్రతిపాదించిన చంద్రబాబు, హంద్రీ-నీవా కాలువను శ్రీశైలంనుంచి కుప్పం దాకా నిర్మించి కృష్ణా జలాలతో కరువు నేలను పావనం చేయడానికి తాను ఎన్ని కష్టాలు పడిందీ, మధ్యలో వైసీపీ పాలనలో ప్రాజెక్టు ఎలా ఆగిపోయిందీ, తిరిగి మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంత పట్టుదలతో కాలువ నిర్మాణం పూర్తిచేసి కృష్ణమ్మను కుప్పం తీసుకు వచ్చిందీ సవివరంగా ప్రజలకు తెలియజెప్పారు. కుప్పానికి రెండేళ్ల ముందే కృష్ణా పుష్కరాలు వచ్చాయని చమత్కరించిన ఆయన, జలాల ప్రాముఖ్యత, అన్నదాతకు వాటి అవసరం, పాడిపంటలతో జీవితాలు సుఖవంతం కావడం వంటి అంశాలతో గ్రామీణ ప్రాంత ప్రజల మనసులను చూరగొన్నారు. కరువు నేలలో బోర్లు వేసి నీళ్ల పడక నష్టపోయిన రైతు ముఖంలో కృష్ణమ్మ తెచ్చిన ఆనందాన్ని తన మాటల్లో వర్ణించారు. వరి వద్దని, వాణిజ్య పంటలే వేయమని సలహా ఇచ్చారు. తన సహజ శైలికి భిన్నంగా అచ్చమైన రైతు బిడ్డలా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతుంటే సభకు హాజరైన గ్రామీణ జనం మంత్రముగ్ధులై విన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు వేదిక వెనుక ప్రత్యేకంగా వేసిన గుడారంలోకి వెళ్లి, కుప్పంలో ప్రాజెక్టులు నిర్మించనున్న 5 కంపెనీలతో కడా ద్వారా ఒప్పందాలు కుదుర్చుకున్నారు.షెడ్యూల్‌లో పేర్కొన్న సమయానికి సుమారు 2 గంటలు ఆలస్యంగా సాయంత్రం 6 గంటలకు హెలికాఫ్టర్ ద్వారా బెంగళూరు పయనమయ్యారు.

తిరుప్పావై ఉపన్యాసాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు 16 నుంచి 2026 జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుప్పావై ఉపన్యాసాలిచ్చేందుకు వైష్ణవ సిద్ధాంతం తెలిసిన పండితుల నుంచి దరఖాస్తులు, అంగీకర పత్రాలను టీటీడీ ఆహ్వానిస్తోంది. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏటా ధనుర్మాసంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అర్హులైనవారు సోమవారం నుంచి సెప్టెంబరు 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు 'ప్రత్యేకాధికారి, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్, శ్వేతాభవనం, టీటీడీ, తిరుపతి' అనే చిరునామాకు దరఖాస్తులు, అంగీకర పత్రాలు పంపాల్సి ఉంటుంది. అంగీకార పత్రాలు ఇచ్చే పండితుల పట్టికతో వివరాలను, దరఖాస్తులను టీటీడీ.తిరుమల.ఓఆర్జీ అనే వెబ్‌సైట్ నుంచి పొందచ్చని టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.

రేపటి నుంచి గిరిజనులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధార్ కార్డు లేక ప్రభుత్వ పథకాలు పొందలేనటువంటి గిరిజనుల కోసం మండల, మున్సిపల్ కేంద్రాల్లో సోమవారం నుంచి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రాజా సోము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి అవసరమైన జనన, నివాస ధృవీకరణ పత్రాలు సైతం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబరు 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ క్యాంపులను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూడు సింగిల్‌విండోలకు పాలకవర్గాల ఏర్పాటు

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు సింగిల్ విండోలకు ప్రభుత్వం నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది. చిల్లకూరు సింగిల్ విండో ఛైర్మన్‌గా కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడు, సభ్యులుగా ఎద్దల రామకృష్ణారెడ్డి, పెళ్లకూరు గోపాల కృష్ణ నియమితులు కాగా నాయుడుపేట సింగిల్‌విండోకు ఛైర్మన్‌గా గుండ్లూరు ప్రభాకర్ నాయుడు, సభ్యులుగా ఆళ్ల పరంధామయ్య, బిరదవాడ నారాయణ నియమితులయ్యారు. అలాగే దగ్గవోలు సింగిల్‌విండో ఛైర్మన్‌గా ఈతముక్కల సురేంద్ర, సభ్యులుగా ఈతముక్కల రాజేంద్ర, ఎద్దల ఉదయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ కమిటీల పదవీ కాలం వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకు ఉంటుంది. .

రెండు ఎక్స్‌ప్రెస్‌లు రద్దు : హెల్ప్ డెస్క్ ఏర్పాటు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వరదల నేపథ్యంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను శనివారం, కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ను ఆదివారం రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో శనివారం ఉదయం నుంచి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కాచిగూడ మధ్య ప్రత్యేక రైలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

మూషిక వాహనంపై వినాయకుడి విహారం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు మూషిక వాహనంపై విహరించారు. కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాకపట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామాలకు చెందిన విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూలవిరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం చేశారు.



అనంతరం స్వామికి చందనాలంకారం చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తర్వాత సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవర్లను మూషిక వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. కాగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం తరఫున ఈవో శీనానాయక్, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్ శనివారం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వీరిని ఈవో పెంచలకిషోర్ సాదరంగా ఆహ్వానించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్‌కు ఈ పట్టు వస్త్రాలను అందించారు.

స్త్రీ శక్తి పథకం భారం కాదు..బాధ్యత

- చంద్రగిరి సభలో ఎమ్మెల్యే నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని - సభకు అశేష సంఖ్యలో హాజరైన మహిళలు

చంద్రగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకాన్ని కూటమి ప్రభుత్వం భారంగా కాకుండా, బాధ్యతగా భావిస్తోందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం చంద్రగిరిలో స్త్రీ శక్తి విజయోత్సవ సభ జరిగింది. ముందుగా నాగాలమ్మ ఆలయం నుంచి అధిక సంఖ్యలో మహిళలతో పులివర్తి నాని, ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డిలు ర్యాలీగా కొత్తపేటలోని మార్కెట్ ఆవరణకు చేరుకున్నారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ హామీలన్నింటినీ నెరవేర్చిందన్నారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులను కూడా చేపడుతోందన్నారు. నియోజకవర్గంలో ఉద్యోగ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. జిల్లాలో పలు పరిశ్రమలు వస్తున్నాయని, అందులో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అన్నారు. వైసీపీ హయాంలో రాక్షస పాలన సాగించి రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందన్నారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సుధారెడ్డి మాట్లాడుతూ వైసీపీ నియోజకవర్గ పునర్విభజన పేరుతో టీడీపీలో గ్రూప్ రాజకీయాలకు తెరలేపిందని, అలాంటి మాటలు నమ్మవద్దని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనలో సుధారెడ్డి ధైర్య సాహసాలతో పోరాడారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు గాలి పుష్పలత, టీడీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, బడి సుధాయాదవ్, ముడిపల్లి సురేష్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, గౌస్‌బాషా, మునిశేఖర్, కేశవులునాయుడు, బెల్లంకొండ మురళి, గిరిధర్‌రెడ్డి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.











తిరుపతిలోని ఎమ్మార్‌పల్లె : తులాభారం వినాయకుడు - వేషాలమ్మ ఆలయం వద్ద : ఐదు తలల పాముపై.. - అరవపల్లెవీధి : పండ్ల చెట్టుపై ఊగుతున్న వినాయకుడు - నిమ్మకాయల వీధి : బ్రహ్మ రూపంలో.. - పరసాలవీధి : నంది వాహనంపై..

'కిక్' ఇవ్వని దరఖాస్తులు

- జిల్లాలో ఆరు బార్లకు నిల్
- ముగిసిన లైసెన్స్‌ల లాటరీ ప్రక్రియ



బార్లకు లాటరీ తీస్తున్న కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన బార్ల లైసెన్స్ లాటరీ విధానం పారదర్శకంగా ముగిసింది. తిరుపతి మినహా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఆశించిన మేర దరఖాస్తులు రాలేదు. దరఖాస్తుల గడువు పొడిగించినా సరైన స్పందన లేదు. ఈ ప్రభావం ఎక్సయిజ్ ఆదాయంపై పడుతుందని భావిస్తున్నారు. కాగా కలెక్టర్ వెంకటేశ్వర్ లాటరీ తీసి, దరఖాస్తుదారులకు లైసెన్స్‌లు కేటాయించారు. మొత్తం 29 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా 23కు మాత్రమే దరఖాస్తులు అందాయి. ఇందులో తిరుపతి నగరంలో అత్యధికంగా 17 బార్లకు గాను 149 దరఖాస్తులు వచ్చాయి. పరిశీలించిన అధికారులు అత్యధికంగా టెండర్ కోడ్ చేసిన 17 మందికి లాటరీ పద్ధతిలో కేటాయిస్తూ లైసెన్సులు జారీ చేశారు. చంద్రగిరి, పుత్తూరులో రెండు బార్లకు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని ఒక బార్‌కు దరఖాస్తులు అందలేదు. నాయుడుపేట పరిధిలో ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు అందాయి. గూడూరు పరిధిలో మూడు బార్లకు గాను ఒక దానికి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. సూళ్లూరుపేటలో రెండు బార్లు, వెంకటగిరిలో ఒక బార్‌కు దరఖాస్తులు అందలేదు. మొత్తంగా 23 బార్లకు దరఖాస్తులు అందగా ఒక్కో దరఖాస్తు రుసుం రూ.5లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు కింద మరో రూ.10వేలు చెల్లించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.8.82 కోట్లు ఆదాయం వచ్చింది. ఇక రిజర్వేషన్ కేటగిరీ కింద గీత కార్మికుల కోసం కేటాయించిన తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు పరిధిలో మూడు బార్లకు గాను 36 దరఖాస్తులు అందాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.1.83 కోట్లు ఆదాయం లభించింది. దీంతో పాటు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో అదనంగా మరో రూ 2.30 కోట్లు ఖజానాకు ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి, ఏసీ శ్రీనివాసులు, ఏఈఎస్ వాసుదేవ చౌదరి పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌తో నటుడు సాయికుమార్ భేటీ



తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): సినీనటుడు సాయికుమార్ శనివారం టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి దర్శనార్థం ఆయన కుమారుడు ఆదితో కలిసి తిరుమలకు వచ్చారు. సాయంత్రం చైర్మన్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ నాయుడిని కలిసి వివిధ అంశాలపై ముచ్చటించారు.

వానాకాలం జ్వరాలతో జాగ్రత్త!





జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్



తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

అడపాదడపా ఆగకుండా కురుస్తున్న వానలు జ్వరాలను వ్యాప్తి చేస్తున్నాయి. వానలకు చెట్టూచేమా పెరిగి పరిసరాలు గుబురుగా మారుతున్నాయి. చిన్న గుంటల్లోనూ నీరు చేరి దోమలు వ్యాపిస్తున్నాయి. సీజనల్‌గా వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటివి పెరుగుతున్నాయి. జలుబు, దగ్గు, తలనొప్పి తో ఇబ్బంది పడేవారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నిరోధానికి ప్రభుత్వ సన్నద్ధత గురించి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ ఆంధ్రజ్యోతి సంభాషణ...

ప్రశ్న : ఈ వర్షాకాలంలో వ్యాధుల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : నీరు నిలిచే, దోమలు ఉండే ప్రదేశాలను గుర్తించాం. శుభ్రం చేయిస్తున్నాం. తాగునీటి బావులు, బోర్లు, కుళాయిల వద్ద క్లోరినేషన్ చేయిస్తున్నాం. ఎక్కడైనా ఒకటి రెండు జ్వరం కేసులు రాగానే వైద్య శిబిరాల ద్వారా సేవలు అందిస్తున్నాం. పరిసరాల శుభ్రత, దోమల విజృంభణపై గ్రామాల్లో సిబ్బంది ప్రచారం చేస్తున్నారు.

ప్రశ్న: మందులకు, నిధులకు, వైద్యులు, ఇతర సిబ్బందికి కొరత ఉందా?

జవాబు : సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా అవుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసే రూ.1.75 లక్షలతో మందులు కొనుగోలు చేసుకునే వెసులుబాటు పీహెచ్‌సీలకు కల్పించాం. మరీ ఇబ్బంది ఉంటే జిల్లా కార్యాలయంలోని ఎపిడమిక్ విభాగమే వైద్యశిబిరాలను నిర్వహిస్తుంది. వైద్యుల, సిబ్బంది కొరత లేదు.

ప్రశ్న: ఎలాంటి వైద్య సేవలను అందిస్తున్నారు?

జవాబు : జిల్లాలో 26 యూపీహెచ్‌సీలు, 58 పీహెచ్‌సీల పరిధిలో దాదాపు 70కి పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. 160కి పైగా రకాల మందులను ఉచితంగా అందిస్తున్నాం. గ్రామీణ పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్యసేవలందించేలా అప్రమత్తం చేశాం. సీజనల్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు, వైద్య సేవలు ఇక్కడే అందేలా చర్యలు తీసుకున్నాం. అత్యవసరమైతే ప్రాంతీయ, ఏరియా ఆస్పత్రులకు లేదా రుయాస్పత్రికి బాధితులను తీసుకువచ్చి వైద్యం అందిస్తునాం.


ప్రశ్న: పిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక చర్యలు?

జవాబు: వర్షాకాలంలో ఎక్కువగా వ్యాధుల బారిన పడే ది పిల్లలు, వృద్ధులూ. వీరి ఆరోగ్య భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. వైద్యారోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శిస్తున్నారు. జలుబు, దగ్గు వంటి చిన్నపాటి లక్షణాలున్నా వైద్య సహాయం అందిస్తున్నారు. ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని, చలిని తట్టుకునే దుస్తులను ధరించాలని సూచిస్తున్నాం వృద్ధులు మరీ అవసరమైతే తప్ప ఈ సీజన్‌లో బయటకు రాకపోవడం మంచిది.

ప్రశ్న : ప్రజలకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

జవాబు : వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేస్తాయి. దోమ తెరలు వాడాలి. దోమల నివారణకు మార్కెట్లలో అమ్మే రసాయనాలతో మరింత జబ్బుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవడమే శ్రేయస్కరం. చిన్నారులు, వృద్ధులు, ఆస్తమా వంటి బాధితులు చిన్నపాటి అనారోగ్యలక్షణాలున్నా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యులను సంప్రదించాలి.

సర్వ దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.39 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,717

తలనీలాలు సమర్పించినవారు: 22,445

శ్రీవారిని దర్శించుకున్న బుద్ధ సర్క్యూట్ యాత్ర సభ్యులు



తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని 'త్రిసేనల బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర' సభ్యులు శనివారం దర్శించుకున్నారు. బుద్ధుడి సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వాలను దేశమంతా వ్యాప్తిచేయాలనే లక్ష్యంతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన త్రిసేనల అధికారులు, బిమ్‌స్టెక్ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో కూడిన బృందం మోటరు సైకిల్ యాత్రగా శుక్రవారం తిరుపతికి చేరుకున్న విషయం తెలిసిందే. వీరి బృందం శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై వినతులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో నమోదు, తొలగింపు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై రాజకీయ పార్టీల నేతలతో కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో నరసింహులు సమావేశమయ్యారు. చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయని, ఓటర్లు ఎక్కువగా ఉన్న కేంద్రాలను సర్దుబాటు చేయాలని టీడీపీ మహిళా నాయకురాలు సుధారెడ్డి కోరారు. ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు సంబంధించిన వివిధ సమస్యలను డీఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నేతలు వరప్రసాద్, నాగార్జున, కలిందర్, చంద్రమోహన్‌రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు, శ్రీకాళహస్తి ఆస్పత్రులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టుల నియామకం

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గూడూరు, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టులు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా కోవూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (జనరల్ సర్జరీ)గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.వెకంటాచలపతి సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతిపై గూడూరు ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. అలాగే గూడూరు ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (పీడియాట్రిక్స్)గా పనిచేస్తున్న డాక్టర్ బీగిరిజ సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతిపై శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వేనాడు దర్గాలో గంధోత్సవం ప్రారంభం



దర్గాలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం

తడ/సూళ్లూరుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతిగాంచిన వేనాడు షేక్ దావూట్ షా వలీ అల్లాతాత దర్గా గంధోత్సవం శనివారం అట్టహాసంగా మొదలైంది. 630 ఏళ్ల చరిత్ర కలిగి 144 అడుగుల పొడవు కలిగిన వేనాడు దర్గా గంధోత్సవానికి నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేశారు. మన ప్రాంతం నుంచేగాక పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పలువురు టీడీపీ నాయకులు గంధోత్సవ ప్రారంభంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేకు దర్గా నిర్వాహకులు సుదర్శన్ రావు, మజార్లు స్వాగతం పలికి, ఆశీర్వచనం చేశారు. దర్గా ప్రాంగణమంతా విద్యుద్దీప కాంతులతో విరాజిల్లింది. ఉర్దూ ఖవ్వాలి, పకీర్ల విన్యాసాల నడుమ తరలివచ్చిన భక్తులు బాబా ఆశీస్సులు పొందారు. దర్గా ఆవరణలో సీసీ కెమెరాలతో పాటు ఎల్ఈడీ స్రీన్ ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటల వరకు భక్తులతో దర్గా ప్రాంగణమంతా కిటకిటలాడింది. అర్ధరాత్రి దాటాక గ్రామ పొలిమేరలో ఉన్న పీర్లచావడి వద్ద ముస్లిం మతపెద్దలు ప్రత్యేక పూజలు చేసి, గంధాన్ని గుమటంపై గ్రామంలో ఊరేగిస్తారు. అనంతరం గంధాన్ని గ్రామ నిర్వాహకుల చేతుల మీదుగా తీసుకెళ్లి దర్గా సమాధి వద్ద లేపనం చేసినానంతరం భక్తులకు పంచిపెడతారు. గంధోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సూళ్లూరుపేట ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో 10మంది ఎస్ఐలు, ఇద్దరు సీఐలు, 120 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చూశారు.



విద్యుత్ వెలుగుల్లో దర్గా ప్రాంగణం

అధునాతన పద్ధతులతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స

- బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్



తిరుపతి(వైద్యం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ మెకాలి మార్పిడి శస్త్ర చికిత్స అవసరమవుతోందని,ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా ఎలాంటి భయాందోళన లేకుండా చేసుకోవచ్చునని బర్డ్ డైరెక్టర్ గుడారు జగదీష్ అన్నారు. పుదుచ్చేరిలోని మహాత్మా గాంధీ వైద్య కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ఆర్థోపెడిక్ అసోసియేషన్ 24వ వార్షిక సమావేశానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 21 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారిలోనూ మోకాలి కీళ్ల సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ఆర్థోపెడిక్ రంగంలో వచ్చిన అధునాతన వైద్య పద్ధతులతో భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందీ లేకుండా మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు చేయవచ్చన్నారు. ఇటువంటి శస్త్ర చికిత్సలు విజయవంతం కావడంలో వైద్యుడి నైపుణ్యం, ఆపరేషన్ సమయంలో తీసుకునే జాగ్రత్తలు, నాణ్యమైన ఇంప్లాంట్లు ఎంపిక చేసుకోవడం ప్రధానమన్నారు. అనంతరం ఆయన ఆర్థోపెడిక్ రంగంలో తాజా ఆవిష్కరణలు, నూతన చికిత్స పద్ధతులు, అధునాతన శస్త్ర చికిత్సా సాంకేతికత గురించి వివరించారు. యువ వైద్యులకు ఆయన అనుభవాలను, పరిశోధనలను గురించి వివరించారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్లు, పరిశోధకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్మెంటు ముందు రోజు టీటీడీ అధికారి మృతి

- కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు?



మృతి చెందిన సుబ్బరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి కోనేటి సుబ్బరాజు(62) ఉద్యోగ విరమణకు ఒక రోజు ముందు (శనివారం) మృతిచెందారు. ఆయన సతీమణి వెంకటసరస్వతి, అలిపిరి సీఐ రాంకిశోర్‌ల కథనం మేరకు.. తిరుపతి కేటీ రోడ్డులోని కేటీ క్వార్టర్సులో ఉంటున్న సుబ్బరాజు కపిలతీర్థం ఆలయంలో ఏఈవోగా పనిచేస్తున్నారు. ఆయన ఆదివారం రిటైర్ కావాల్సి ఉంది. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సునీల్‌కుమార్ టీటీడీలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సుబ్బరాజు కుటుంబ సభ్యులతో కలసి సినిమాకు వెళ్లారు. అక్కడ తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఆయనను స్విమ్స్‌లో చేర్పించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వెంటనే కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదు. భార్య వెంకట సరస్వతి శనివారం ఉదయం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్ఐ అజిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు. కాగా ఈ కేసులో కొంతమంది కుటుంబ సభ్యులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఆయన మృతి వెనుక మరేదైనా కోణం ఉందా అనే దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. మృతుడి మెడపై గాయం ఉన్నట్లు పోలీసులు చెప్పినట్లు సమాచారం.

పీఏసీ5లో 2,500 మందికి వసతి

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5(పీఏసీ) ద్వారా 2,500 మంది భక్తులకు బస కల్పించవచ్చని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన శనివారం పీఏసీ5 భవనంలోని హాళ్లు, కల్యాణకట్ట, మరుగుదొడ్లు, అన్నప్రసాద వితరణ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2018లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బోర్డు ఆమోదం తెలిపిన ఈ ప్రాజెక్ట్ ద్వారా తిరుమలలో యాత్రికుల వసతి సమస్యకు కొంతమేర ఉపశమనం కలుగుతుందన్నారు. ప్రస్తుతం తిరుమలలో 45 వేల మందికి మాత్రమే వసతి సౌకర్యాలు ఉన్నాయని, ఈ భవనం ద్వారా 2,500 మందికి అదనంగా బస లభిస్తుందని అన్నారు. వెంకయ్య చౌదరి మాట్లాడుతూ యాత్రికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ భవనంలో ఆధునిక సదుపాయాలు కల్పించామన్నారు. చంటి పిల్లల తల్లుల కోసం ప్రత్యేకంగా మిల్క్ ఫీడింగ్ గది ఏర్పాటు చేశామన్నారు. ఒకేసారి 1400 మంది అన్నప్రసాదాలు స్వీకరించేలా హాలును ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో రాజేంద్ర పాల్గొన్నారు.

మెడికల్ అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి

తిరుపతి నుంచీ ఇద్దరికి బదిలీ... ఇక్కడికి ముగ్గురి రాక

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ మెకడికల్ కళాశాలల్లో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న పలువురికి ప్రభుత్వం ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించింది. అందులో భాగంగా తిరుపతి ఎస్వీ ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచీ ఇద్దరు పదోన్నతిపై ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా ఇతర ప్రాంతాల నుంచీ ముగ్గురు ఈ కళాశాలకు బదిలీపై రానున్నారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో అనస్థీషియా విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.విజయ్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు, ఈఎన్‌టీ విభాగంలో అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ఆర్ రాజేశ్వరి పదోన్నతిపై పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. అలాగే శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఈఎన్‌టీ విభాగం అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రమేష్ చంద్ర, నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగం అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కే షర్మిల, అక్కడే సైకియాట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.పద్మావతి పదోన్నతిపై ప్రొఫెసర్లుగా తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు బదిలీపై రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

భవనం పైనుంచి పడి బెంగాల్ కార్మికుడి మృతి



మృతి చెందిన కార్మికుడు

రేణిగుంట ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భవనంపై నుంచి కిందపడి పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని విప్పమానుపట్టెడ గ్రామంలో చోటుచేసుకుంది. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. విప్పమానుపట్టెడ గ్రామంలో ఓ ప్రైవేట్ కళాశాల భవనం నిర్మిస్తోంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బిలాస్‌పూర్ గ్రామానికి చెందిన అన్సార్ రెహమాన్ బేల్దారి పని చేస్తూ కాలుజారి భవనం నుంచి కిందిపడిపోయాడు.అక్కడున్న సిబ్బంది చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కార్మికుడు మృతిచెందిన భవనాన్ని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి,రాధాకృష్ణ పరిశీలించారు.భవన యాజమాన్యంతో మాట్లాడి మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారంతోపాటు మృతదేహాన్ని సొంత ఊరికి పంపించేందుకు ఖర్చులు భరించేందుకు అంగీకరింపజేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సులోచనారాణి

గూడూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో సెప్టెంబరు 13వ తేదీన మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి బీవీ.సులోచనారాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునని, దీనివల్ల ఖర్చులు, సమయం ఆదా అవుతాయన్నారు. లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్దంటూ ఆందోళన



డంపింగ్ యార్డు వద్ద రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఇసకపాలెం, కొణ్ణంబట్టు గ్రామాల ప్రజలు

సూళ్లూరుపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును తమ గ్రామాల సమీపంలో ఏర్పాటే చేయొద్దంటూ వదయ్యపాలెం మండలంలోని ఇసకపాలెం, కొణ్ణంబట్టు గ్రామస్థులు శనివారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీకి కొణ్ణంబట్టు గ్రామ సర్వే నెంబరు 13-1 లో 10 ఎకరాల భూమిని ఇటీవల డంపింగ్ యార్డుకు కేటాయించారు. రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీ సంబంధిత పత్రాలు అప్పగించారు. దీంతో మున్సిపాలిటీలో సేకరించిన చెత్త, వ్యర్థాలతో ట్రాక్టర్లు డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలం వద్దకు వెళ్లాయి. ఇంతలో సమీప గ్రామస్థులు అక్కడకు చేరుకుని చెత్త ట్రాక్టర్లను అడ్డగించారు. ఇక్కడ చెత్త వేసేందుకు వీల్లేదంటూ రోడ్కెక్కి ఆందోళన చేపట్టారు.విషయం తెలుసుకున్న తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య అక్కడకు చేరుకుని గ్రామస్థులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, డంపియంగ్ యార్డు వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని చెప్పారు.

మధుమోహన్ సేవలు ఆదర్శనీయం



మధుమోహన్‌దాస్ దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు,

పెళ్లకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ధమాల పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న మధుమోహన్ దాస్ ఉద్యోగ విరమణ సన్మాన సభ శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా మాట్లాడుతూ మధుమోహన్ దాస్ అర్ధమాల పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూనే పునబాక, పుల్లూరు, కలవకూరు ఇన్‌చార్జిగా సమర్థవంతంగా వ్యవహరించి ఆదర్శనీయమైన సేవలు అందించారని అన్నారు. డీఎల్‌పీవో వెంకటరమణ, పెళ్లకూరు, నాయుడుపేట ఎంపీడీవోలు ప్రమీలాణి, సురేష్‌బాబు మాట్లాడుతూ మధుమోహన్ దాస్ పనిచేసిన ప్రతిచోటా ప్రజాప్రయోజ నాలకు పెద్దపీట వేశారని కొనియాడారు. మధుమోహన్‌దాస్, స్వర్ణకుమారి దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 మించల శంకరయ్య, ప్రధానోపాధ్యాయుడు రాయపాటి వెంకటేశ్వర్లు, నాయకులు వేలూరు హరి నాయుడు, బియ్యపు గోవిందరెడ్డి, లింగంనాయుడు, కేవీ నాయుడు, పునబాక పోలయ్య, తాళ్ల యుగంధర్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, సాగి జితేంద్ర, అట్ల కృష్ణ, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినం

ఓజిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడులో ఎస్సీ కాలనీలో శనివారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలోపౌర హక్కుల దినం నిర్వహించారు. గిరిజనులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్‌ఐ శ్రీకాంత్, ఏవో వరప్రసాద్, ఏపీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో శనివారం తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం జరిగింది. అధికారులు పౌరహక్కుల గురించి విద్యార్థినులు, స్థానికులకు అవగాహన కల్పించారు. చట్టాల గురించి వివరించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

చిట్టమూరు, ఫిబ్రవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాం రొయ్యల కాలువ వంతెన వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకయ్య(22) దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు.... యల్లసిరి గ్రామానికి చెందిన వెంకయ్య, ఎల్లూరు గ్రామానికి చెందిన రాజీ బైక్‌పై మల్లాం వెళ్తుండగా వంతెనపై అదుపుతప్పి దిమ్మలను ఢీకొంది. వెంకయ్య తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకయ్య మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

డీజే బాక్సుల స్వాధీనం

కోట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు నందమూరి బసవతారక కాలనీలో శనివారం రాత్రి వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక యువత డీజే సౌండ్‌తో చిందులేస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న డీజే సౌండ్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు.

ఇష్టానుసారంగా ఇటుక బట్టీలు

అడుగడుగునా నిబంధనల అతిక్రమణ

పెళ్లకూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలో ఇష్టానుసారంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా స్వర్ణముఖినది తీర ప్రాంత వ్యవసాయ భూముల్లో ఇటుక బట్టీలు అత్యధికంగా ఉన్నాయి. వీటిల్లో సగానికి పైగా బట్టీలకు ఎలాంటి అనుమతులు లేకపోగా, నిబంధనలు పాటించడంలేదు. ముఖ్యంగా వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ సమీపంలోని చెరువులు, అటవీ భూములు, పంట కాలువల నుంచి మట్టి, స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. వాస్తవానికి గ్రామాల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేయాలంటే పంచాయతీ అధికారుల అనుమతి తీసుకోవాలి. అదేవిధంగా ఇటుకల తయారీకి మట్టి, ఇసుక కోసం రెవెన్యూ అనుమతులు ఉండాలి. ఇటుకలను కాల్చేందుకు పొల్యూషన్ అధికారుల అనుమతి తప్పనిసరి. అలాగే బట్టీలో తయారవుతున్న ఇటుకల సంఖ్య ఆధారంగా పంచాయతీకి రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎక్కడా ఇటుక బట్టీల వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. అధికారులు స్పందించి అక్రమ ఇటుక బట్టీలపై దృష్టి సారించి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



తాళ్వాయిపాడు వద్ద జాతీయ రహదారి పక్కన ఇటుక బట్టీలు

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

గూడూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ వారికి వైద్యసేవలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యానికి సీఎం చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని, తమ ప్రభుత్వ హయాంలోనే స్థానిక ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్ సెంటర్, డయాలసిస్ యూనిట్ ప్రారంభించడం జరిగిందన్నారు. డయాలసిస్ యూనిట్‌లో ఏసీలు సక్రమంగా పని చేయడంలేదని తమ దృష్టికి వచ్చిందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఆస్పత్రిలో అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి త్వరలోనే పనులు చేపడతామని చెప్పారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ ఆస్పత్రి నూతన భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తెస్తామన్నారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా, శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

వెంకయ్య నాయుడికి సన్మానం



వెంకయ్యనాయుడిను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నాయుడుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడిని శనివారం నాయుడుపేటకు చెందిన బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం వద్ద స్వర్ణభారత్ ట్రస్టుకు విచ్చేసిన ఆయనను బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు బొల్లకాయల విజయబాస్కర్, సీనియర్ నాయకులు కొప్పోలు సుబ్రహ్మణ్యం, ఆరూరు సుధాకర్, రాయపాటి విద్యాసాగర్, వెంకి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించండి



మంత్రి నారాయణతో టీడీపీ నేత వెంకటేశ్వర్లు నాయుడు

గూడూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్ రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించాలని మంత్రి నారాయణను టీడీపీ నేత నంబూరు వెంకటేశ్వర్లునాయుడు కోరారు. శనివారం నెల్లూరులోని మంత్రి నివాసంలో నారాయణను కలిశారు. హైస్కూల్‌రోడ్డులో రోడ్డు పోరంబోకు భూమిలో ప్రజాప్రయోజనాల దృష్ట్యా దాతల సహకారంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అనుమతులు ఇప్పించాలని కోరారు.

వాకాడు తహసీల్దారుగా సయ్యద్ ఇక్బాల్



వాకాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాకాడు తహసీల్దారుగా సయ్యద్ ఇక్బాల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న రామయ్య నెల రోజుల క్రితం సస్పెండ్ అయ్యారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సయ్యద్ ఇక్బాల్‌ను తహసీల్దారుగా నియమించారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

గూడూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన బాలికను తల్లిదండ్రులకు శనివారం రెండో పట్టణ పోలీసులు అప్పగించారు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన బాలిక మనస్థాపంతో శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు సమీప బంధువుల ఇళ్ల వద్ద గాలించినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి సాధుపేట సెంటర్‌లో బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్ష



దీక్ష చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సూళ్లూరుపేట ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో వద్ద శనివారం ఉద్యోగులు రిలే నిరహార దీక్ష చేపట్టారు. కండక్టర్ పద్మను సస్పెన్షన్‌ను నిరసిస్తూ డిపో అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పద్మ కండక్టర్ సస్పెన్షన్ వెంటనే ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుష్పలత, గౌరి, కుసుమ, జాలమ్మ, శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను వేగవంతం చేయండి

దక్కిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వే పనులను వేగవంతం చేయాలని గూడూరు డివిజన్ సర్వే విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ పెంచలయ్యతో కలిసి రీసర్వేపై గ్రామ సర్వేయర్లకు దిశానిర్దేశం చేశారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో విలేజ్ బౌండ్రీలు, జాయింట్ ఎల్పీఎంలు, ఎఫ్ లైను, సబ్‌డివిజన్ రికార్డులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

ఆలయ భూముల సర్వే

సూళ్లూరుపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోట పోలూరులోని ఖరేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాలకు సంబంధించిన భూములను శనివారం ఈవో మమత పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది సర్వే చేశారు. పడమటి కండ్రిగలో ఖరేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 1.26 ఎకరాలు, కోదండరామస్వామి ఆలయానికి సంబంధించి 3.43 ఎకరాలు ఉన్నట్లు గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు.

పార్శిల్ పేరిట మోసం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పార్శిల్ పేరుతో మోసం చేసిన ఘటన నాయుడుపేట పట్టణంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.... పట్టణంలోని బేరిపేట, సీఎస్‌తేజ సెంటర్, బజారువీధి ప్రాంతాల్లోని ముగ్గురికి శుక్రవారం పార్శిల్స్ వచ్చాయి. రూ.900 చెల్లించి తీసుకోవాలని డెలివరీ బాయ్ చెప్పాడు. తాము ఏ వస్తువూ ఆన్‌లైన్ ఆర్డర్ చెయ్యలేదని వారు తెలిపారు. ఆర్డర్ కాపీలో మీ చిరునామాలే ఉన్నాయని, అందుకే తెచ్చామని డెలివరీ బాయ్ చెప్పడంతో బాధితులు నగదు చెల్లించి పార్శిళ్లు తీసుకున్నారు. కొంతసేపటి తరువా వాటిని తెరచి చూడగా ఒక పార్శిల్ చిన్నపిల్లల పాత ప్యాంట్, మరొక దాంట్లో చిన్నపిల్లలు ఆట వస్తువు, మరో కవరులో చిన్నపాటి ప్లాస్టిక్ వస్తువులు ఉన్నాయి. మోసం చేయడానికే పార్శిళ్లు పంపారని, దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని బాధితులు చెప్పారు.

ఖరీఫ్‌లో ఎన్‌ఎల్‌ఆర్ 3648 అనువైన రకం



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

దొరవారిసత్రం. ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ఎన్‌ఎల్‌ఆర్ 3648 కొత్త రకం వరి వంగడం అనువైనదని నెల్లూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వినీత, శ్రీలక్ష్మి తెలిపారు. దొరవారిసత్రం మండలం లింగంపాడులో రైతు దిలీప్ సాగు చేసిన ఎన్‌ఎల్‌ఆర్ 3648 వంగడాన్ని శనివారం స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో శాస్త్రవేత్తలు పరిశీలించారు. కంకెకు ఎన్ని విత్తనాలు, విత్తనాల నిడివి పరిశీలించారు. 20నుంచి 25 దుబ్బులు, ఒక వెన్నులో 250నుంచి 300 వరకు గింజలు ఉన్నట్లు గుర్తించారు. 130 నుంచి 135 రోజులు పంట కాల పరిమితి కలిగిన ఈ వంగడం 35నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఏడీఏ కాంచన, దొరవారిసత్రం ఏవో జ్యోతిర్మయి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ఎటువంటి కొరతలే కుండా యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని చెబుతున్నా, సక్రమంగా సరఫరా జరగకపోవడంతో అవస్థలు పడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది డీలర్లు యూరియా కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీ మండల కమిటీ ఎన్నిక

వాకాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండల వైసీపీ కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. మండల అధ్యక్షుడిగా కొండాపురం గ్రామానికి చెందిన ఏనుగు సుధాకర్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా పామాంజి రమణమ్మ, నల్లారెడ్డి మధుసూదనరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఏనుగు పుష్ప, ఉడతా శ్రీనివాసులు, బందిలి వెంకటయ్య, కోశాధికారికగా వాకాటి జనార్దనరెడ్డి ఎంపికయ్యారు. కార్యదర్శులుగా బండి వెంకటరత్నమ్మ, యర్రబోతు శేఖర్, చేవూరు మునిభాస్కర్, పాకం భాస్కర్, షేక్ జలీల్, రౌతు రాధాకృష్ణతో పాటుగా కార్యనిర్వాహక కార్యదర్శులుగా పొన్నా సుబ్రహ్మణ్యం, గురునాథం మునస్వామిరెడ్డి, బందిలి రవి, షేక్ మస్తానమ్మ, షేక్ మస్తాన్, ఎంబేడు లక్ష్మీదేవమ్మ, రవినూకల చెంచుకృష్ణయ్య, ఆనం వెంకటరమణయ్య, మల్లి అంకమ్మ, ఎంబేటి రమణయ్య, సంగీతం భాస్కర్, ఉమ్మడి చంద్రయ్య, ఎంబేటి బాబు, షేక్ గౌస్‌మొహిద్దీన్ ఎంపికయ్యారు.



కోట విద్యానగర్, చిల్లకూరు ఉట్టి కొడుతున్న యువకులు

కోలాహలంగా గణనాథుడి గ్రామోత్సవాలు

కోట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం గణనాథుడి గ్రామోత్సవాలు కోలాహలంగా జరిగాయి. చెందోడు, విద్యానగర్, విజయాకాలనీ, గూడలి తదితర గ్రామాల నుంచి వినాయక విగ్రహాలు గ్రామోత్సవం నిర్వహించారు. విద్యానగర్‌లో విద్యార్థుల ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవం నిర్వహించారు. శ్రీనివాససత్రం బీచ్‌లో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన పలు మండలాల నుంచి వినాయక విగ్రహాలను తీసుకువచ్చి నిమజ్జనం చేశారు.



నాయుడుపేటలో ఉట్టి ఉత్సవంలో యువత ఉత్సాహం

చిల్లకూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు కూడళ్లల్లో ఉట్టి ఉత్సవం నిర్వహించారు. ఆదివారం ఐదవ రోజు కావడంతో పలు విగ్రహాలను నిమజ్జనానికి తరలించనుండడంతో ఆయా మండపాల వద్ద ఉట్టి ఉత్సవం జరిపారు. స్థానిక దళితవాడలోని వినాయక విగ్రహం వద్ద యువకులు, చిన్నారులు చిందులు వేస్తూ ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఆయా విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు.

నాయుడుపేట టౌన్: స్థానిక దర్గావీధిలో ఏర్పాటైన 23 అడుగులతో వినాయక విగ్రహం వద్ద ఉట్టి ఉత్సవం నిర్వహించారు. టీడీపీ నాయకులు పొట్లపూడి రాజేష్, యువకులు ఉట్టి ఉత్సవంలో పాల్గొన్నారు. అన్నదానం చేశారు. అలాగే రజక కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

విద్యాబోధనలో మెలకువలు పాటించాలి

కోట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యాబోధనలో మెలకువలు పాటించాలని ఎంఈవోలు శిరీషా, మస్తానయ్య కోరారు. మండల పరిధిలోని చిట్టేడు, కోటలోని బాలుర ఉన్నత పాఠశాల, పెదగోవింద పల్లి ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం జరిగాయి. విద్యాబోధనలో పాటించాల్సిన మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎంఈవోలు అవగాహన కల్పించారు. సమావేశంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.